

16ఏళ్ల హాకీ కెరీర్‌కు రాణి రాంపాల్ గుడ్ బై

8

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 83 | విజయవాడ, శుక్రవారం 25 అక్టోబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 25 October 2024 | Rs

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 11న జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణం



న్యూఢిల్లీ : దేశ సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)గా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులయ్యారు. ప్రస్తుత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ పదవీకాలం ఈ ఏడాది నవంబరు 10న ముగియనుంది. ఈ నేపథ్యంలో తన తర్వాత సిజెఐగా జస్టిస్ సంజీవ్ పేరును జస్టిస్ చంద్రచూడ్ ప్రతిపాదిన సంగతి తెలిసిందే. ఈ ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం ఆమోదముద్ర వేశారు. దీంతో వచ్చే నవంబరు 11న జస్టిస్ సంజీవ్ ఖన్నా భారత సర్వోన్నత న్యాయస్థానం ప్రధానన్యాయమూర్తిగా పదవీ స్వీకార ప్రమాణం చేయనున్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ తెలిపారు. 2025 మే 13 వరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా సిజెఐగా కొనసాగనున్నారు.



కర్నూలు మార్కెట్‌కు వచ్చిన ఉల్లి

ఉల్లి రైతుకు సున్నం!

- సీజన్‌లోనూ గతేడాది కన్నా తక్కువ ధర

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దక్షిణ భారతదేశంలో అత్యధికంగా ఉల్లిని పండించే కర్నూలు జిల్లా రైతులు మార్కెట్ మాయాజాలం ఉచ్చులో చిక్కుకున్నారు. ఉల్లికి డిమాండ్ బాగున్నా రైతుకు మాత్రం న్యాయమైన ధర దక్కడం లేదు. బహిరంగ మార్కెట్లో ఉల్లి కిలో రూ.60పైనే ఉంది. రైతుకు మాత్రం కిలోకు రూ.25 నుంచి రూ.35 మధ్య మాత్రమే ధర లభిస్తోంది. బహిరంగ మార్కెట్లో వినియోగదారులు అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దళారులు లాభాలు మూటగట్టుకుంటున్నారు. వ్యాపారులు సిండికేటై రైతులకు ధర దక్కనీయకుండా చేస్తున్నారు. గతేడాది సీజన్ కంటే ఈ ఏడాది సీజన్లో రైతులకు ఇచ్చే ధరను తగ్గించేశారు. మాన్యువల్ విధానంలో ఉల్లి కొనుగోలులో వ్యాపారులు సిండికేటై రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. కర్నూలు మార్కెట్లో 220 మంది కమిషన్ ఏజెంట్లు ఉన్నారు. ఈ నామ్ విధానంలో అయితే వారు ధరను ఆన్‌లైన్ నమోదు చేయాల్సి ఉంటుంది. మరో వ్యక్తికి ధర తెలిసే అవకాశం ఉండదు. ఈ నామ్ కాకుండా ఆఫ్‌లైన్ విధానంలో కొంటుండడంతో కమీషన్ ఏజెంట్లు అందరూ మాట్లాడుకుని రైతు పంటకు ధరను నిర్ణయిస్తున్నారు. గతేడాది అక్టోబర్‌లో క్వింటాలు ఉల్లికి గరిష్టంగా రూ.5,598 దక్కింది. ఈ ఏడాది మాత్రం రూ.4,500 దాటలేదు. ఖరీఫ్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు ఆరు లక్షల ఎకరాలు కాగా, ఈ ఏడాది 5.8 లక్షల ఎకరాల్లో వేశారు. ఎకరం విస్తీర్ణంలో ఉల్లి సాగుకు రూ.80 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. విత్తనాలకు రూ.10 వేలు, రసాయనిక ఎరువులకు రూ.17 వేలు, సేద్యానికి రూ.4 వేలు, కలుపు తీయడానికి రూ.15 వేలు, క్రిమిసంహారక మందులకు రూ.20 వేలు, కోతలకు రూ.10 వేల వరకూ ఖర్చవుతోంది. ఇటీవల వర్షాలు కురిసి ప్రస్తుతం తెరపి ఇవ్వడంతో మళ్లీ వర్షాలు కురిస్తే ఉల్లి కుళ్లిపోతుందన్న భయంతో రైతులు ఉల్లి కోతలపై దష్టి పెట్టారు. రైతులు ఒకేసారి ఉల్లి కోసి మార్కెట్‌కు తీసుకొస్తుండడంతో రికార్డు స్థాయిలో సరుకు వస్తోంది. గతేడాది అక్టోబర్‌లో అత్యధికంగా ఒకే రోజు 8,380 క్వింటాళ్ల ఉల్లి కర్నూలు మార్కెట్‌కు వచ్చింది. ఈ ఏడాది ఈ రికార్డు బ్రేక్ అయింది. బుధవారం (ఈ నెల 23న) ఒక్క రోజే 19,870 క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌కు వచ్చింది. దీంతో, మార్కెట్‌లోని షెడ్లన్నీ ఉల్లితో నిండిపోయాయి. ఈ నెల 5న 11,150 క్వింటాళ్లు, 9న 10,968 క్వింటాళ్లు, 21న 13,070 క్వింటాళ్ల ఉల్లి వచ్చింది. ప్రస్తుతం క్వింటాలు ఉల్లి కనిష్టంగా రూ.444, మధ్యస్తంగా రూ.3,589, గరిష్టంగా రూ.4,581 పలికింది. మార్కెట్‌కు వస్తున్న ఉల్లిలో అత్యధికం మొత్తానికి క్వింటాలుకు రూ.2500 నుంచి రూ.3500 మధ్య మాత్రమే ధర

మిగతా 7లో

నేటి నుంచి పశుగణన

- పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశవ్యాప్త పశుగణనలో భాగంగా రాష్ట్రంలోనూ శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకూ పశుగణన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల కార్యదర్శి ఎంఎం నాయక్ తెలిపారు. విజయవాడ పశు సంవర్ధకశాఖ కార్యాలయం నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1.50 కోట్ల కుటుంబాలకు సంబంధించి పశువుల వివరాలను నమోదు చేయాల్సి ఉందన్నారు. పశుపెంపకం దారులు తమ వద్ద ఉన్న పశువులు, కోళ్లకు సంబంధించి సరైన వివరాలను అందజేయాలన్నారు. పశుగణన పూర్తయిన అనంతరం ప్రతి ఇంటి ప్రధాన ద్వారానికి కుడివైపున స్టిక్కర్లు అంటిస్తారని తెలిపారు. ఈ పశుగణన భవిష్యత్తు ప్రణాళికలు, విధానాల రూపకల్పనకు కీలకమైన సమాచారాన్ని అందిస్తుందన్నారు. పశుగణన ప్రతి ఐదేళ్లకు ఒకసారి చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, వివిధ రకాల కోళ్లు, పక్షులతో సహా 16 రకాల పెంపుడు జంతువులపై జాతుల వారీ సమాచారాన్ని సేకరించాలన్నారు. నేషనల్ డైరీ డవలప్‌మెంట్ బోర్డు భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఆండ్రాయిడ్ అప్లికేషన్‌ను ఉపయోగించి ఈ పశుగణనను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 5,390 మంది వివరాల సేకరణ దారులు, 1,238 మంది సూపర్ వైజర్లు, 45 మంది పరిశీలన అధికారులు, ఇతర ఫీల్డ్ సిబ్బంది ఉంటారన్నారు. 21,173 గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాల నుంచి వివరాలు సేకరిస్తారన్నారు. ఇందుకోసం 5,390 ట్రావెలింగ్ కిట్లు, 60 వేలు పోస్టర్లు, 1.50 కోట్ల స్టిక్కర్లు, 8 వేల ఐడి కార్డులతో సహా మెటీరియల్‌ను జిల్లాలకు పంపిణీ చేశామన్నారు.

అమరావతి మీదుగా కొత్త రైల్వే లైన్

- రూ.2,245 కోట్లతో 57 కిలోమీటర్లు
- ఐదేళ్లలో ప్రాజెక్టు పూర్తి
- కేంద్ర మంత్రివర్గం ఆమోదం


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతి మీదుగా రైల్వే కొత్త లైన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీన్ని రూ.2,245 కోట్లతో ఐదేళ్లలో పూర్తి చేయనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం గురువారం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కేంద్ర మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను వెల్లడించారు. ఎర్రుపాలెం-నంబూరు మధ్య అమరావతి మీదుగా 57 కిలోమీటర్ల మేర కొత్త లైన్ నిర్మాణం ఐదేళ్లలో పూర్తవుతుందని తెలిపారు. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు కొత్త రైలుమార్గం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టిఆర్ విజయవాడ, గుంటూరు జిల్లాలు, తెలంగాణలోని ఖమ్మం జిల్లాల మీదుగా ప్రయాణిస్తుందన్నారు. కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల పొడవైన బ్రిడ్జిని నిర్మిస్తామని తెలిపారు. ఈ కొత్త లైన్ నిర్మాణంతో ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత రాజధాని 'అమరావతి'కి ప్రత్యక్ష కనెక్టివిటీ ఏర్పడుతుందన్నారు.

రైల్వే మంత్రిత్వశాఖ అంచనా వ్యయం

రూ.6,798 కోట్లతో రెండు రైల్వే ప్రాజెక్టుల ప్రతిపాదనలకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులతో మూడు రాష్ట్రాల్లోని ఎనిమిది జిల్లాలు అంటే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్‌లను కవర్ చేస్తూ దాదాపు 313 కిలోమీటర్ల మేర రైల్వే లైను పెంచనున్నట్లు చెప్పారు. ఇందులో

మిగతా 7లో



ఆన్‌లైన్‌లో కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ తదితరులతో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ప్రధానితో శంకుస్థాపన : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రైల్వే లైన్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేత శంకుస్థాపన చేయించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఆన్‌లైన్లో కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ఎంపి పురంధేశ్వరితో గురువారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రైల్వేలైన్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీకి, కేంద్ర మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలిపారు. నవంబర్ లేదా డిసెంబరు నెలలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించాలని ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఈ రైల్వేలైన్ చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు, కలకత్తా నగరాలకు అమరావతిని కలుపుతుందని తెలిపారు. మూడేళ్లలోఈ ప్రాజెక్టును పూర్తి చేస్తే మరింత ఉపయోగంగా ఉంటుందని అన్నారు. కొత్త త్తలైను నిర్మాణంలో భాగంగా 25 లక్షల చెట్లను నాటాలన్న కేంద్ర నిర్ణయం వల్ల ఈ ప్రాంతంలో కార్బన్ డై ఆక్సైడ్‌ను నివారించడం సాధ్యమవుతుందని చెప్పారు. రాష్ట్రం నుండి ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంటు కూడా తగిన సమయంలో అందిస్తామని తెలిపారు.

పల్నాడులో డయేరియా కాటు

- రెండుకు చేరిన మృతుల సంఖ్య
- తాగునీటి కాలుష్యమే కారణం?



మృతదేహాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రజాశక్తి - దాచేపల్లి (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీలోని అంజనాపురంలో డయేరియా మృతుల సంఖ్య రెండుకు చేరింది. బుధవారం తెల్లవారుజామున తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు (21) వాంతులు, విరేచనాలతో మృతి చెందారు. గురువారం బండారు చిన్నవీరయ్య పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. తాగునీటి పైపు లైను లీకేజీ కావడంతో పారిశుధ్యం లోపం వల్ల డయేరియా ప్రబలిందని గ్రామస్తులు తెలిపారు. దాచేపల్లి అంజనాపురంలోగల బోరు ద్వారా గ్రామంలోని ఎక్కువ ప్రాంతాలకు తాగునీటి సరఫరా అవుతోంది. ఈ పైపులైన్ల లీకేజీ, మురుగునీరు కలవడం వల్ల నీటి కాలుష్యంతో దాదాపు పది మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. కాలనీలో సుమారు 300 కుటుంబాలు ఉన్నాయి. కలుషిత నీటి సమస్యలపై గతంలో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఆరుగురు బాధితులు ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, మరికొందరు ఇళ్లల్లోనే వైద్యం పొందుతున్నారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరి మృతితో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ స్పందించారు. విజయవాడలో ఆయన అధికారులతో సమీక్షించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిడుగురాళ్లలో ఆస్పత్రిలో బండారు చినవీరయ్య మృతదేహాన్ని కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సందర్శించారు. బుధవారం తమ్మిశెట్టి వెంకట్ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని అంజనాపురం వెళ్లి పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుండి సాయం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తాగునీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించామని, భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా రాక్‌శాండ్ ఫిల్టర్ విధానం ద్వారా ఈ ప్రాంతానికి తాగునీరు అందిస్తామని చెప్పారు. అంజనాపురంలో డయేరియా ప్రబలిన ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలని, ఇళ్లల్లో ఎవరైనా అస్వస్థతకు గురై ఉంటే వెంటనే ఆస్పత్రికి పంపాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో ఇంటింటి సర్వే చేస్తున్నామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవికుమార్ తెలిపారు. స్థానికంగా వైద్యారోగ్యశాఖ వైద్యశిబిరం నిర్వహిస్తుం డగా, అంజనాపురం కాలనీ మొత్తం డ్రెయినేజీలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. కాలనీకి నీరు సరఫరా చేసే బోరు బావి పైప్‌లైనును మరమ్మతులు చేయించారు. డయేరియాతో మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

జగన్ తీరు సరికాదు

- ఆస్తుల పంపంకంపై షర్మిల



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆస్తుల పంపకం విషయంలో జగన్ అనుసరిస్తున్న తీరు సరికాదని ఆయన సోదరి, పిసిసి అధ్యక్షులు షర్మిల తెలిపారు. రెండురోజులుగా వారి వ్యక్తిగత ఆస్తులమీద మీడియాలో వార్తలు వస్తున్న నేపథ్యంలో గురువారం ఆమె స్పందించారు. గొడవలను సామరస్యంగా నాలుగు గోడల మధ్య పరిష్కరించుకోవాలని ఉందని, అన్ని సాధారణ విషయాలు అంటూనే తల్లీ చెల్లిని కోర్టుకు ఈడ్చారని తెలిపారు. 'ఇది సామాన్య విషయం కాదు జగన్‌సార్' అని స్పందించారు. మీడియా ప్రతినిధులు ప్రశ్నలు అడగ్గా సమాధానం ఇచ్చేందుకు ఇష్టపడలేదు. అయితే సరస్వతి పవర్లో వాటాలను తన తల్లి, చెల్లికి ప్రేమ పూర్వకంగా రాశామని, ఇటీవల షర్మిల ప్రవర్తిస్తున్న తీరుతో తమకు ఇబ్బంది కలిగిందని, తమ అగ్రిమెంటు రద్దు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని జగన్ ఎన్‌సిఎల్‌టిని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీనిపై రెండు రోజులుగా తీవ్ర దుమారం రేగింది. తన సోదరి తనకు వ్యతిరేకంగా తన పరువుకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తోందని, తనపై ప్రేమ లేదని తేలిపోయిందనీ పిటీషన్లో జగన్ పేర్కొన్నారు. మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య కూడా ఇదే అంశంపై వైసిపి కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతిలో షర్మిల కీలుబొమ్మగా మారారని అన్నారు. హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలను బేఖాతరు చేస్తూ చట్ట విరద్ధంగా మోసపూరితంగా పేర్లను బదిలీ చేశారని తెలిపారు. అందువల్లే జగన్ ఎన్‌సిఎల్‌టిని ఆశ్రయించారని పేర్కొన్నారు. ఎటాచ్‌మెంట్లో ఉన్న ఆస్తుల పేర్లను ఎలా బదలాయిస్తారని ఆయన ప్రశ్నించారు. తండ్రి చనిపోయిన ఇన్నేళ్లకు షర్మిలకు ఈ వ్యవహారం ఎందుకు గుర్తుకు వచ్చిందని అన్నారు. ఈ విషయంలో చంద్రబాబుకు ఎటువంటి సంబంధమూ లేదని, అయినా టిడిపి అధికారిక ట్విటర్లో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పేర్లు మార్పు వ్యవహారం ద్వారా దాన్ని చట్టపరమైన వ్యవహారంగా మార్చి జగన్ బెయిల్ రద్దు చేయించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని పేర్కొన్నారు.

హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు

- రాష్ట్రపతి ఆమోద ముద్ర

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు నియమితులయ్యారు. వారి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కూడా ఎక్స్ వేదికగా ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్ర హైకోర్టులో న్యాయవాదులుగా ఉన్న కుంచం మహేశ్వరరావు, తూట చంద్ర ధనశేఖర్, చల్లా గుణరంజన్ హైకోర్టుకు అదనపు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. వీరి నియామకం కోసం ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో చర్చించిన తరువాత, వీరిని రాష్ట్ర హైకోర్టుకు అదనపు న్యాయమూర్తులుగా నియమించారు. రాష్ట్ర హైకోర్టులో 37 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 26 మంది ఉన్నారు. ఈ ముగ్గురి నియామకంతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 29కి చేరింది. ఇంకా ఎనిమిది పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. .

పూరి-సాగర్ ఐలండ్ మధ్య నేడు తీరం దాటనున్న దానా

- ఒడిశా, బెంగాల్లో భారీ వర్షాలు
- 15గంటల పాటు మూతపడిన కోల్‌కతా ఎయిర్‌పోర్ట్
- పెద్ద సంఖ్యలో రైళ్లు రద్దు
- ఒడిశాలో 10 లక్షల మంది, బెంగాల్‌లో లక్ష మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు



పూరి, కోల్‌కతా : వాయవ్య బంగాళాఖాతంలో శక్తివంతమైన తీవ్ర తుపానుగా మారిన 'దానా' గురువారం అర్ధరాత్రి నుండి శుక్రవారం ఉదయంలోగా తీరం దాటుతుందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. పూరి-సాగర్ ఐలండ్ మధ్య తీరం దాటే అవకాశం వుందని భావిస్తున్నారు. ప్రస్తుతం తుపాను ఉత్తర వాయవ్య దిశగా గంటకు 12కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఈ ప్రభావంతో గురువారం అర్ధరాత్రి, శుక్రవారం గంటకు 100 నుండి 110కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ ప్రాంత జిల్లాలైన తూర్పు, పశ్చిమ మిడ్నాపూర్, కోల్‌కతా, హౌరా, హుగ్లీ, నార్త్, సౌత్ 24 పరగణాలు జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం వుందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) పేర్కొంది. తుపాను ప్రభావంతో ఇప్పటికే ఒరిస్సా, బెంగాల్‌ల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

ఈ నేపథ్యంలో దాదాపు 10లక్షలమంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ఒరిస్సా రెవిన్యూ, విపత్తు నిర్వహణా శాఖ మంత్రి సురేష్ పూజారి చెప్పారు. 2వేల మంది సిబ్బందిని, 182 బృందాలను ఒరిస్సా మోహరించింది. పరిస్థితి తీవ్రతను దృష్టిలో వుంచుకుని

మిగతా 7లో

21 జిల్లాల్లో డిఇఓల నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 21 జిల్లాల్లో విద్యాశాఖ అధికారులు నియామకమయ్యారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం మన్యం డిఎస్‌ఇఓగా ఎన్‌టి నాయుడు, విజయనగరం డిఇఓగా యు మాణిక్యంనాయుడు, విశాఖపట్నం డిఇఓగా ఎన్ ప్రేమ్‌కుమార్‌ను నియమించారు. అనకాపల్లికి జి అప్పారావునాయుడు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డిఎస్‌ఇఓగా ఎస్‌కె సలీంబాషా, ఏలూరు డిఇఓగా ఎం వెంకటలక్ష్మమ్మ, పశ్చిమగోదావరి డిఎస్‌ఇఓగా నారాయణమ్మ, కృష్ణా డిఇఓగా పివిజె రామారావు, పల్నాడు డిఎస్‌ఇఓగా ఎల్ చంద్రకళ, గుంటూరు డిఇఓగా సివి రేణుకను నియమించారు. బాపట్లకు ఎస్ పురుషోత్తం, నెల్లూరుకు బాలాజీరావు, తిరుపతికి కెవిఎన్ కుమార్, చిత్తూరుకు బి వరలక్ష్మిని డిఇఓగా నియమించారు. అన్నమయ్యకు కె సుబ్రహ్మణ్యం, వైఎస్‌ఆర్ జిల్లాకు యు మీనాక్షి, సత్యసాయికి జి కృష్ణప్ప, అనంతపురానికి ఎం ప్రసాద్‌బాబు, కర్నూలుకు ఎస్ శామ్యూల్‌పాల్, నంద్యాలకు పి జనార్ధనరెడ్డిని డిఎస్‌ఇఓగా నియమించారు.

తగ్గిన 'ఉపాధి'

- లిబ్‌టెక్ నివేదిక వెల్లడి



ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

రాష్ట్రంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ)లో ఉపాధి అవకాశాలు తగ్గినట్లు లిబ్ టెక్ ఇండియా తన నివేదికలో పేర్కొంది. పని దినాలు పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అవసరమని నొక్కి చెప్పింది. ఉపాధి హామీ చట్టం అమలుకు సంబంధించి ప్రత్యేకంగా పనిచేస్తున్న ఈ సంస్థ ప్రభుత్వ వెబ్‌సైట్ గణాంకాలను, వాస్తవ పరిస్థితిని క్రోడీకరించింది. సీనియర్ రీసెర్చర్ రాహుల్ ముక్కెర, డేటా ఎనలిస్ట్ దివాకర్ మంత్రి తన బృంద సభ్యులతో కలిసి ఉపాధి పనుల తీరుతెన్నులను ఆ నివేదికలో విశ్లేషించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉపాధి పనుల అమలును కూడా పరిశీలించి కొన్ని నిర్ధారణలకు వచ్చారు. అందులో భాగంగా 2024 ఏప్రిల్ -సెప్టెంబర్ మధ్య ఉపాధి హామీ చట్టం అమలుపై లిబ్‌టెక్ ఇండియా చేసిన సర్వే నివేదికను గురువారం మీడియాకు విడుదల చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నమోదైన పని దినాలను 2023-24లో ఏప్రిల్-సెప్టెంబరుతో పోల్చినప్పుడు మన రాష్ట్రంలో 11.8 శాతం తగ్గాయని ఈ నివేదిక తెలిపింది. దేశంలో పనిదినాల తగ్గుదల 16 శాతం ఉన్నట్లు వివరించింది. రాష్ట్రంలోని 26 జిల్లాలకుగానూ 22 జిల్లాల్లో ఉపాధి కల్పనలో తగ్గుదల ఉన్నట్లు తెలిపింది. అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 35.1 శాతం, కర్నూలులో 30.9, తిరుపతిలో 22.4 శాతం చొప్పున తగ్గుదల ఉన్నట్టు పేర్కొంది. పార్వతీపురం మన్యంలో 17.6 శాతం, శ్రీసత్యసాయి జిల్లాలో ఎనిమిది శాతం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4.7 శాతం పనిదినాల్లో పెరుగుదల ఉందని నివేదికలో తెలిపింది. ఎస్‌సిలకు 15.5 శాతం, ఇతరులకు 12.6 శాతం పనిదినాలు తగ్గాయని, ఎస్‌టిలకు 1.7 శాతం మేర కొద్దిగా పెరిగాయని పేర్కొంది. రాష్ట్రంలో 2.85 లక్షల మంది కూలీలు తొలగించబడ్డారని, 3.43 లక్షల మంది కొత్తగా నమోదయ్యారని తెలిపింది.

కేంద్ర ప్రభుత్వ జోక్యం

2024 మేలో కేంద్రం నుంచి వచ్చిన ఒక ఆదేశం పని దినాల్లో తగ్గుదలకు కారణమై ఉండొచ్చని అభిప్రాయపడింది. వ్యవసాయ సంబంధిత కార్యకలాపాల్లో 60 శాతం ఖర్చు నియమంతోపాటు మరికొన్ని నియమాలను పాటించలేదని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని హెచ్చరించినట్టు తెలిపింది. మన రాష్ట్రంలో ఉపాధి హామీ చట్టం అమలులో ఉపాధి అవకాశాలు తగ్గడం పట్ల తన నివేదికలో లిబ్‌టెక్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆ సవాళ్లను అధిగమించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అవసరమని పేర్కొంది.

లిబ్‌టెక్ ఏం చేస్తుంది ?

లిబ్ టెక్ ఇండియా గ్రామీణ భారత్‌లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో పారదర్శకత, సమర్థత పెంపొందించడానికి కృషి చేస్తున్న ఇంజనీర్లు, సామాజిక శాస్త్రవేత్తలు, కార్యకర్తల సమూహం. ఉపాధి హామీ చట్టంపై అవగాహన కల్పించేందుకు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలలో పారదర్శకతను పెంచేందుకు దశాబ్ద కాలం నుంచి కృషి చేస్తోంది.

కనెక్టివిటీకి ప్రాధాన్యం

- ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతితో పాటు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో కనెక్టివిటిని ఏర్పాటు చేయడానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జాతీయ రహదారుల పనులపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణానికి డిపిఆర్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నేషనల్ హైవేతోపాటు రాష్ట్ర హైవేలను కూడా పూర్తి చేస్తే కనెక్టివిటీ పెరుగుతుందని అన్నారు. రణస్థల నుండి శ్రీకాకుళం వరకూ నాలుగు లైన్ల నుండి ఆరులైన్లు చేయడం సంతోషం వ్యక్తం చేశారు. 129 ప్రాజెక్టుల్లో 3300 కిలోమీటర్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో మొత్తంగా 8,784 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉన్నాయని, కొత్త రోడ్లు 3300 కిలోమీటర్లు రాబోయే రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆరులైన్ల రోడ్లు రాష్ట్రంలో తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. కలకత్తా నుండి ఇచ్ఛాపురం నుండి తడ వరకూ వచ్చే రోడ్డును మరింత విస్తరించేందుకు అవకాశం ఉందని, దానికి అనుమతులు వచ్చాయని పేర్కొన్నారు కేంద్రం నుండి పర్యావరణ అనుమతులు తీసుకోవడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. బెంగుళూరు, కడప విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వేకు సమస్యలు ఉంటే 15 రోజుల్లో క్లియర్ చేయాలని కోరామన్నారు.

కడప చినఓరంపాడు నాలుగులైన్ల రోడ్డు సమస్యనూ పరిష్కరించాలని తెలిపినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అన్ని ప్రాజెక్టులకు గ్రహణం పట్టిందని, కీలకమైన కనెక్టివిటీపై అశ్రద్ధ పెట్టారని అన్నారు. గత ఐదేళ్లలో తప్పుడు కేసులకే ప్రాధాన్యత ఇచ్చారని, అమరావతి అనంతపురం హైవే ఎలైన్‌మెంట్ మార్చేశారని పేర్కొన్నారు. అమరావతి కడప, అనంతపురం పనులు పూర్తిచేశాక ఇంకా ఏమిచేయాలో ఆలోచిస్తామని తెలిపారు.

వాటా ఇవ్వకుండా తల్లీ చెల్లిని నిందిస్తున్నాడు

ఆస్తి విషయంలో వాటా ఇవ్వకుండా తల్లీ చెల్లిపై కోర్టుకు వెళ్లి వాటిల్లోకి తమను లాగుతున్నాడని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయంలో తమను తీవ్ర ఇబ్బందులు పెట్టారని, తమ ప్రభుత్వంలో జగన్ స్వేచ్ఛగా బయట తిరుగుతున్నాడని అన్నారు. 2004లో జగన్ ఆదాయం ఎంత, ఇప్పుడు ఎంత? ఇన్ని లక్షల కోట్లు ఎక్కడ నుండి వచ్చాయని ప్రశ్నించారు. అమరావతికి కేంద్రం డబ్బులిస్తామంటే వద్దన్నారని, ప్రజావేదికను కూల్చారని పేర్కొన్నారు. అమరావతిని ఎడారిగా చేశారని తెలిపారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

సాంకేతిక సమస్యలు పరిష్కరించి సాయం అందించండి

సాంకేతిక సమస్యల వల్ల ప్రభుత్వ సాయం అందని వరద బాధితుల సమస్యలను పరిష్కరించి రెండు రోజుల్లో సాయమందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ అంశంపై సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. పరిహారం కోసం వచ్చే ప్రతి దరఖాస్తునూ పరిశీలించాలని, అర్హులు ఉంటే తప్పనిసరిగా సాయం అందేలా చూడాలని అన్నారు. ఆయా సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించాలన్నారు. ఎవరైనా పరిహారం పొందడానికి అనర్హులైతే ఆ విషయాన్ని వారికి స్పష్టంగా తెలియజేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా ప్రభుత్వం సాయమందించిన విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఏ ఒక్క అర్హుడికీ సాయం అందకుండా ఉండకూడదనే ఉద్దేశంతోనే ఇప్పటికీ తాను ఈ అంశంపై సమీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. అతిపెద్ద విపత్తును అత్యంత సమర్ధవంతంగా ఎదుర్కొన్న ప్రభుత్వం ఒకరిద్దరికి సాయం విషయంలో వెనకడుగు వేసేది లేదన్నారు. వరదలు వచ్చిన 15 రోజుల్లో 4,19,528 మందికి పరిహారం అందిందని, ఇప్పటి వరకూ రూ.618 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశామని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. అనంతరం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 9 వేల మందికి మరో రూ.16 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. కొత్తగా 2,954 దరఖాస్తులు అందగా, 1,646 దరఖాస్తులు అర్హత కలిగినవిగా గుర్తించామన్నారు. వీటిలో 850 దరఖాస్తుదారులకు గురువారం పరిహారం జమ చేశామని, మిగిలిన 796 మందికి శుక్రవారం పరిహారం అందించనున్నట్లు అధికారులు వివరించారు.

ఆదాయంపై అస్పష్టత

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వార్షిక బడ్జెట్‌ను వచ్చే నెలలో ప్రవేశపెట్టాల్సి ఉండగా ప్రతిపాదనలపె మాత్రం స్పష్టత మాత్రం రావడం లేదు. చేయాల్సిన వ్యయం కళ్ళముందు కనిపిస్తున్నప్పటికీ, ఆదాయంపై మాత్రం అస్పష్టత కనిపిస్తోందని ఆర్థికశాఖ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. కొత్తగా ప్రవేశపెట్టాల్సిన కొనసాగింపు బడ్జెట్‌ను కనీసం పాతిక నుంచి 30 వేల కోట్లవరకు ప్రతిపాదించాల్సి ఉంటుందని వారు చెబుతున్నారు. దీనికి సంబంధించి .ముఖ్యమంత్రి దగ్గర ఒక సమావేశం, ఆర్థిక మంత్రి దగ్గర ఒక భేటీ జరగ్గా, ఆర్థిక శాఖ అధికారులు రెండు దఫాలు గా భేటీ అయినట్లు తెలిసింది. అయినప్పటికీ ఆదాయ పెంపు మార్గాలను మాత్రం ఖరారు చేయలేకపోయినట్లు తెలిసింది.

ఎన్ విడియా సిఇఒతో లోకేష్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచ ప్రఖ్యాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంప్యూటింగ్ సంస్థ ఎన్ విడియా సిఇఒ జెన్సన్ హువాంగ్‌తో రాష్ట్ర విద్య, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం భేటీ అయ్యారు. ఎపి పరిపాలనా వ్యవహారాల్లో వేగవంతమైన, మెరుగైన సేవలకు ఎఐ టెక్నాలజీ వినియోగించాలన్నది తమ అభిమతమని పేర్కొన్నారు. అమరావతిలో ఏర్పాటు చేయబోయే ఎఐ యూనివర్సిటీకి సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన హువాంగ్ రాబోయే రోజుల్లో ఎఐ టెక్నాలజీ ద్వారా అంతర్జాతీయంగా ఎటువంటి విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోబోతున్నాయో వివరించారు. స్పీచ్ రికగ్నిషేషన్, మెడికల్ ఇమేజింగ్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఎఐ వినియోగానికి అవసరమైన కంప్యూటింగ్ పవర్ టూల్స్, ఆల్గారిథమ్‌లను ఎన్ విడియా అందిస్తోందని వివరించారు. ఇటీవల బ్లూమ్‌బర్గ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఎన్ విడియా 3.5 ట్రిలియన్ మార్కెట్ విలువ కలిగి ఉండగా, కంపెనీ సహ వ్యవస్థాపకులు, సిఇఒ జెన్సన్ ప్రపంచంలో 11వ అత్యంత సంపన్న వ్యక్తిగా ఉన్నారు.

ఆమె ఆశయాలను కొనసాగిద్దాం

- 'జ్యోత్స్న జ్ఞాపకాలతో...' కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

స్త్రీ, పురుష సమానత్వం కోసం జ్యోత్స్న ఎంతో కృషి చేశారని, ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించారని పలువురు వక్తలు కొనియాడారు. "జ్యోత్స్న జ్ఞాపకాలతో..." కార్యక్రమం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ నెల 8న రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో అమరావతి బాలోత్సవ్ కమిటీ కార్యదర్శి, తరుణీతరంగాలు ప్రధాన కార్యదర్శి, సేఫ్ వ్యవస్థాపకురాలు గుళ్లపల్లి జ్యోత్స్న మరణించారు. ఆమె జ్ఞాపకాలను పంచుకునేందుకు ఎంబివికె, అమరావతి బాలోత్సవం, సేఫ్, ఐద్వా, ఎస్ఎఫ్ఐడబ్ల్యు, పిఒడబ్ల్యు, తరుణితరంగాలు, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జన శిక్షణా సంస్థాన్, స్పృహాప్తి ఆర్గనైజేషన్, భారత మహిళా మండలి, నిర్భయ కాంత్రి మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంబివికె బాధ్యులు, ఐద్వా సీనియర్ నాయకురాలు కె.స్వరూపారాణి, సీనియర్ జర్నలిస్ట్ వడ్డమూడి పద్మ, ఇండియన్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ కె.ఉషారాణి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తొలుత ఐద్వా జాతీయ నాయకులు ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ.. మహిళలను చైతన్యపరిచేందుకు జోత్స్న ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించారని, తద్వారా అందరి హృదయాల్లో స్థానం సంపాదించారని తెలిపారు. ఆమె పాటించిన అభ్యుదయ భావాలను ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు. అమరావతి బాలోత్సవ్ కార్యదర్శి ఆర్.కొండల రావు మాట్లాడుతూ బాలోత్సవాలను విజయ వంతం చేయడంలో జ్యోత్స్న కీలకపాత్ర పోషించారని, చిత్తశుద్ధితో మహిళా చైతన్యం కోసం శ్రమించారని కొనియాడారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పూర్ణానంద్ మాట్లాడుతూ ఎన్నో సామాజిక, సేవా కార్యక్రమాల ద్వారా సమాజాభ్యున్నతికి జ్యోత్స్న పరితపించారన్నారు. జ్యోత్స్న సోదరుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సురేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్క సంఘటన గురించి ఆమెతో చర్చించేవాడినని గుర్తు చేసుకున్నారు. కుటుంబపరంగా జరిగే కార్యక్రమాలను ముందుండి నడిపించేవారని గుర్తు చేసుకున్నారు. సిద్ధార్థ మహిళా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.విజయలక్ష్మి మాట్లాడుతూ కళాశాల విద్యార్థినులకు వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు జ్యోత్స్న కృషి చేశారన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరుగుతున్న వివిధ సంఘటనలను ఆధారంగా చేసుకుని మహిళలను, ముఖ్యంగా విద్యార్థినులను చైతన్యపరచేందుకు పలు కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించారని తెలిపారు. ఈ నేపథ్యంలో యువతలు జ్యోత్స్నను స్ఫూర్తిగా తీసుకుని మహిళా చైతన్యం కోసం కృషి చేయాలన్నారు. సమన్విత సభ్యులు ఒ.శాంతిశ్రీ మాట్లాడుతూ చినప్పటి నుండి జ్యోత్స్నతో అనుబంధం ఉందన్నారు. ఆమె చూపే ఆప్యాతయ, అనురాగం గుర్తుండిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తరుణీతరంగాలు అధ్యక్షులు రావి శారద, ఎంబివికె కార్యదర్శి పి.మురళీకృష్ణ, ఎస్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి అక్కినేని వనజ, పిఒడబ్ల్యు నాయకులు గంగాభవానీ, భారత మహిళా మండలి అధ్యక్షులు లక్ష్మి తదితరులు మాట్లాడారు.



జ్యోత్స్న చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఐద్వా జాతీయ నాయకురాలు ఎస్.పుణ్యవతి

ప్రజల దృష్టిని మళ్లించేందుకే 'జమిలి'

- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రధాని మోడీ జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొచ్చారని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ తెలిపారు. 'ప్రజాస్వామ్య భారతం-జమిలి ఎన్నికలు' అనే అంశంపై శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళా మందిరంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంవిఎస్ శర్మ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. దేశంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఉందని, ధరలు, నిరుద్యోగం వంటి అంశాలపై ప్రజలను ఆలోచించనీయకుండా ప్రధాని మోడీ జమిలి ఎన్నికల అంశాన్ని ఎజెండాగా తీసుకొచ్చారని తెలిపారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నందున అక్కడి ప్రజలు వారి సమస్యలపై కాకుండా జమిలీ ఎన్నికల అంశంపై మాట్లాడేలా మోడీ ఆ అంశాన్ని ఎజెండా తీసుకొచ్చారని చెప్పారు. తనకు 400 సీట్లు ఇవ్వాలని అడిగిన మోడీకి ఇటీవల ఎన్నికల్లో 240 సీట్లకే పరిమితం చేశారంటే ప్రజలు జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నారనే విషయాన్ని మోడీ అర్థం చేసుకోవాలని హితవు పలికారు. రాజ్యాంగం జోలికి వెళ్లొద్దని ప్రజలు తీర్పిచ్చారని అన్నారు. దామాషా పద్ధతిలో ఎన్నికలు జరపడంతోపాటు ప్రజా ప్రతినిధులను రీకాల్ చేసే హక్కు ప్రజలకు ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. జమిలి ఎన్నికలతో ఫెడరల్ స్ఫూర్తి దెబ్బతింటుందన్న స్పృహ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు లేకుండా పోయిందని, గుడ్డిగా మోడీ తీసుకొచ్చిన జమిలి ఎన్నికలను సమర్థిస్తున్నారని విమర్శించారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యంపై దాడి అని తెలిపారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ వన్ నేషన్ వన్ ఎలక్షన్ తర్వాత దేశంలో ఇక నో ఎలక్షన్ అని ఆయన అన్నారు. జమిలి ఎన్నికలపై పాలకులు చెప్తున్న కారణాలేవీ నిజం కాదని, వారికి వేరే ఎజెండా ఉందని తెలిపారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు విజికె మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా, కార్మిక, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, జర్నలిస్ట్, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

చిరుత మృతి కేసులో పురోగతి

- పోలీసుల అదుపులో ఐదుగురు అనుమానితులు
- చిరుత అవశేషాలు స్వాధీనం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు జిల్లా యాదమరి మండలం తాళ్లమడుగు అటవీ ప్రాంతంలో చిరుత పులి మృతి కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి చిరుత అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను వెస్ట్ రేంజ్ అటవీశాఖ కార్యాలయంలో డిఎఫ్ఒ భరణి గురువారం మీడియాకు వెల్లడించారు. తాళ్ళమడుగు గ్రామం వెతలచేను అటవీ ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన కొందరు వేటగాళ్లు వన్యప్రాణులను చంపడానికి పొలం వద్ద విద్యుత్ తీగలను అమర్చినట్లు గుర్తించామన్నారు. విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై చిరుత మృతి చెందిందని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. దర్యాప్తులో భాగంగా ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద నుంచి చిరుత పులి అవశేషాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. ఎవరైనా వన్యప్రాణులను చంపడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు వారి పొలాల వద్ద ఎవరైనా అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ఉంటే పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యేకు తాత్కాలిక ఊరట

ప్రజాశక్తి-అమరావతి

తాడిపత్రి పోలీసులు పెట్టిన 3 కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, కుమారులు హర్షవర్ధన్‌రెడ్డి, సాయిప్రతాప్‌రెడ్డి, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను గురువారం హైకోర్టు విచారణ జరిపింది. పోలీసులు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను నవంబర్ 11కి వాయిదా వేసింది. అప్పటి వరకు పిటిషనర్లపై కఠిన చర్యలు తీసుకోరాదని పోలీసులను జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ ఆదేశించారు. నిందితులపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు.

ఎపి అభివృద్ధికి బాటలు

- పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని పరిధిలో కొత్త రైల్వే లైను నిర్మాణానికి కేంద్రమంత్రి మండలి ఆమోదం తెలపడం శుభపరిణామమని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఎర్రుపాలెం, అమరావతి నంబూరు మధ్య రైల్వేలైను నిర్మించడం వల్ల రాజధాని అభివృద్ధి సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపారు. రాజధానికి వచ్చే ప్రజలకు అధికారులకు ఉద్యుగులతోపాటు అమరావతి స్తూపం, ఉండవల్లి గుహలు, అమరలింగేశ్వరస్వామి ఆలయం, ధాన్యబుద్ధ ప్రాజెక్టు సందర్శనకు వచ్చేవారికి ఈలైను అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు.

శుభపరిణామం : మంత్రి నారాయణ

అమరావతి రైల్వేలైనుకు అనుమతి రావడం శుభపరిణామమని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. ?కొత్తగా వేసే లైను మచిలీపట్నం, కృష్ణపట్నం, కాకినాడకు కనెక్టివిటీగానూ ఉంటుందని పేర్కొన్నారు. నాలుగేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. అమరావతి పరిధిలో గత కాంట్రాక్టులన్నీ 15 రోజుల్లో రద్దుచేస్తామని, కొత్తవాటిని పిలుస్తామని పేర్కొన్నారు.

వచ్చే ఐదేళ్లలో కాపులకు రూ.15 వేలకోట్లు లబ్ధి

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాపు సామాజిక తరగతి అభ్యున్నతికి వచ్చే ఐదేళ్లలో రూ.15 వేలకోట్లు వెచ్చించడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని బిసి, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టిడిపి హయాంలో కాపులకు అమలు చేసిన అన్ని పథకాలనూ తిరిగి ప్రారంభించనున్నట్లు చెప్పారు. కాపు భవనాల నిర్మాణం, యువతకు అన్ని విధాలా అండగా నిలిచేలా కార్యాచరణను ఇప్పటికే సిద్ధం చేసినట్లు వెల్లడించారు. జగన్ పాలనలో కాపులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కాపు కార్పొరేషన్ ఎమ్‌డి ఎస్ కృష్ణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ అప్‌గ్రేడ్‌కు రూ.252 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలోని శ్రీకాకుళంలో రణస్థలం వద్ద ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్‌ను అప్‌గ్రేడ్ చేయడానికి, అభివృద్ధి చేయడానికి రూ.252.42 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారి శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఎక్స్‌లో ప్రకటించారు. కొత్త సామాజిక, ఆర్థిక అవకాశాలను సృష్టించడంతోపాటు ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో, రహదారి భద్రతను మెరుగుపరచడంలో, పట్టణ మొబిలిటీని మెరుగుపరచడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా ఉంటుందన్నారు. రద్దీని తగ్గించడంతోపాటు, ఈ చొరవ ఆర్థిక కార్యకలాపాలను పెంచుతుందని, తద్వారా ఈ ప్రాంత వాసులకు జీవన నాణ్యతను మెరుగుపరుస్తుందని తెలిపారు.

అత్యాచారాలు అరికడతాం

- మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలలో పిల్లలకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల ఐసిడిఎస్ పిడిలు, ఆర్‌జెడిలతో సచివాలయంలో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాల నిర్మూలనకు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. ఇందుకు సంబంధించిన అంశాలపై వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా అన్ని అంగన్‌వాడీలలో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు, పోలీసు హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేసి పిల్లలకు వాటి గురించి తెలియజెప్పాలన్నారు. చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించే విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని అంగన్‌వాడీ సెంటర్లకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేందుకు రూ.52 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలను చర్యలు తీసుకోవాలని, బాలకార్మికలను, రోడ్లపై బిక్షాటన చేసేవారిని గుర్తించి చైల్డ్ హోమ్‌కు తరలించి అక్కడ వారికి విద్యాబుద్ధులు నేర్పించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

డిఎస్‌పి వేధిస్తున్నారని పిటిషన్

ప్రజావక్తి-అమరావతి

ఆళ్లగడ్డ పట్టణం విడిచి వెళ్లాలని డిఎస్‌పి వేధిస్తున్నారంటూ టిడిపి నేత ఎవి సుబ్బారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. పోలీసులు వివరాలను అందజేయాలని ఆదేశించారు. విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తున్నట్లు గురువారం జస్టిస్ బివిఎల్ఎన్ చక్రవర్తి ప్రకటించారు. ఆళ్లగడ్డ పట్టణం వదిలి వెళ్లాలని ఒత్తిడి చేయకుండా డిఎస్‌పికి ఉత్తర్వులివ్వాలని, డిఎస్‌పి మౌఖికంగా వేధిస్తున్నారని పిటిషనరు వాదనలకు అనుగుణంగా మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరించారు. పోలీసుల వాదనల తర్వాతే తగిన ఉత్తర్వులు జారీ చేయగలమని స్పష్టం చేశారు.



సహన కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాల్యాద్రి

సిఎం, డిప్యూటీ సిఎం స్పందించకపోవడం శోచనీయం

- సహన కుటుంబానికి న్యాయం చేయాలి
- కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి
- బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి తెనాలి (గుంటూరు జిల్లా)

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైన మధిర సహన హత్యోదంతంపై హోంమంత్రి ఇప్పటి వరకు స్పందించకపోవడం శోచనీయమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి అన్నారు. రౌడి షీటర్ రాగి నవీన్ చేతిలో తెనాలికి చెందిన యువతి గురైన సహన హత్యకు గురికావడంతో ఆమె కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం మాల్యాద్రి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడంలేదన్నారు. సహన కుటుంబ సభ్యులకు రూ. పది లక్షలు చెక్కు ఇచ్చి చేతులు దులుపుకున్న ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రౌడీ షీటర్ నవీన్ గాయపరిచిన దెబ్బలు కారణంగా బ్రెయిన్ డెడ్ అయిన సహన నాలుగు రోజులపాటు అత్యవసర చికిత్స పొందుతూ మతి చెందిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైనప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గాని, హోం మంత్రి వనితగాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌గాని స్పందించకపోవడం శోచనీయమన్నారు. నిర్భయ చట్టం అమలు చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితులను త్వరితగతిన కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పి బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించాలని కోరారు. 2014 మాదిరిగా జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను అమలు పరచాలన్నారు. ప్రభుత్వం ముందుకొచ్చి సహన కుటుంబానికి మరింత ఆర్థిక భరోసా ప్రకటించాలని, మృతురాలి కుటుంబానికి రూ 50 లక్షలతో పాటు, ఐదెకరాల పొలం, ఇంటిస్థలం మంజూరు చేసి గృహనిర్మాణం, ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజా సంఘాలతో కలసి ఉద్యమిస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం తెనాలి కమిటి కార్యదర్శి కొల్లిపర బాబూ ప్రసాద్, రైతు సంఘం నాయకులు ములకా శివ సాంబిరెడ్డి, పి జోనేష్, మహిళా సంఘం నాయకురాలు ఎన్ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు.

సమగ్ర జల విధానం రూపొందిస్తాం

- సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నదుల అనుసంధానం, నీటి నిర్వహణ, నీటి సంరక్షణ, కరువు రహిత రాష్ట్రం అనే అంశాలతో సమగ్ర జల విధాన రూపకల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల స్థితిగతులు ఆర్థిక అవసరాలు, పెండింగ్ పనులపై బుధవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత అధికారులు పోలవరం ప్రాజెక్టు పనుల ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలవరం పనుల్లో ఇసిఆర్ఎఫ్ డ్యామ్ ఏరియాలో డీవాటర్ పనులు మొదలుపెట్టి లెవల్‌ను 19 మీటర్ల నుండి 16 మీటర్లకు తగ్గించామని, 0.29 టిఎంసి నీటిని తోడేశామని వివరించారు. డయాఫ్రం వాల్ పనులు 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని బావర్ కంపెనీ ప్రతినిధులు తెలపగా అంతకంటే ముందే పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం సూచించారు. పోలవరం ఫేజ్-1 పనుల కోసం రూ.7,213 కోట్లతో భూసేకరణ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఖర్చు పెట్టాల్సి ఉందని అధికారులు తెలిపారు. దశలవారీగా పనులు పూర్తిచేయాలని సిఎం తెలిపారు. డయాఫ్రం, ఇసిఆర్ఎఫ్ వాల్ ఎప్పటికి పూర్తవుతాయనే అంశంపై నిర్దిష్ట అంచానలతో వస్తే యాక్షన్‌ప్లాన్ రూపొందిచొచ్చని అన్నారు. అలాగే హంద్రీనీవా సుజల స్రవంతి మెయిన్ కెనాల్ సామర్థ్యాన్ని పెంచే అంశంపై చర్చించారు. రూ.2,561 కోట్లు ఖర్చు పెడితే మొత్తం హంద్రీనీవా కాలువల లైనింగ్ పనులు పూర్తి చేయొచ్చని అధికారులు వివరించగా, సిఎం అంగీకరించారు. రెండో ఫేజ్‌లో అడవిపల్లి రిజర్వాయర్‌కు నీవా బ్రాంచ్ కెనాల్‌కు నీటిని తీసుకెళ్లేందుకు పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని తెలిపారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఫేజ్-1 నాటికి మొదటి దశలో నీరు వచ్చే సీజన్ నాటికి అందించేందుకు అవసరమైన పనులు పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. గోదావరి పెన్నా అనుసంధానంపై సమగ్ర నివేదికతో రావాలని అధికారులకు సిఎం సూచించారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1లో రూ.1,458 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందులో సివిల్ వర్కులు రూ.200 కోట్లు కాగా మిగిలింది ఆర్అండ్ఆర్ భూసేకరణ ఖర్చని అధికారులు వివరించారు. ఫేజ్-1లో భాగంగా 1.19 లక్షల ఎకరాలకు వచ్చే సీజన్ నాటికి నీళ్లు వచ్చేలా పనులు పూర్తి చేయాలని సిఎం అధికారులకు తెలిపారు. ఉత్తరాంధ్రలో వంశధార ఫేజ్-2 ప్రాజెక్టుకు రూ.122 కోట్లు ఖర్చవుతుందని, వీటినివచ్చే సీజన్ నాటికి పూర్తి చేస్తామని అధికారులు సిఎంకు వివరించారు. ఎపిలో ఉన్న అన్ని ప్రాజెక్టుల్లో కలిసి మొత్తం 983 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 840 టిఎంసిల నీరు ఉందని అధికారులు తెలిపారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న శాఖలతో సమన్వయం చేసుకుని ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆ శాఖ అధికారులకు సూచించారు. గుర్లలో డయేరియా వ్యాధిపై ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ అందించిన నివేదికపై సచివాలయంలో అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. గుర్ల అనుభవం నుంచి పాఠాలు నేర్చుకోవాలని, ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గుర్లలో వైద్యారోగ్య సిబ్బంది తీసుకున్న చర్యలను మంత్రికి ఆ శాఖ డైరెక్టరు కె పద్మావతి వివరించారు. నిత్యజీవితంలో ఆచరించాల్సిన ఆరోగ్యకరమైన పద్ధతులు, అలవాట్లు పట్ల ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి ప్రచార ఉద్యమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థలు, తాగునీటి సరఫరా, పారిశుధ్య శాఖ అధికారులతో క్షేత్రస్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీటి వనరులను కలుషితం చేసే మార్గాలను గుర్తించి, నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.


బకాయిలు చెల్లించేందుకు చర్యలు

ప్రభుత్వాస్పత్రులకు మందులు, సర్జికల్ పనిముట్ల సరఫరాదారులకు బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల రూ.900 కోట్లు బకాయిలు ఉండగా, ప్రస్తుతం కొంత మేర చెల్లించామన్నారు. ఈ విషయంపై సంబంధిత సంస్థల అధికారులతో సచివాలయంలో సమీక్షించారు. మందుల, సర్జికల్ పనిముట్లు ఆయా ఆస్పత్రుల అవసరానికి తగ్గట్లుగా పంపిణీ చేయాలన్నారు. సర్వజనాస్పత్రులు 20 శాతం, ఇతర ఆస్పత్రులు 10 శాతం వారి బడ్జెట్‌లో కొనుగోళ్లు చేసుకోవచ్చని, ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలోని కమిటీలు ఈ కోనుగోళ్లు చేస్తాయన్నారు. ఈ సమావేశంలో సంస్థ ఎమ్‌డి లక్ష్మీశా తదితరులు పాల్గొన్నారు.

నందిగం బెయిల్ కేసు విచారణ నేటికి వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి మాజీ ఎంపి నందిగం సురేష్ పోలీసుల కస్టడీలో చెప్పిన వివరాలను అందజేసేందుకు గడువు కావాలని పోలీసులు హైకోర్టును కోరారు. పోలీసుల తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గురువారం చేసిన వినతితో విచారణ శుక్రవారానికి వాయిదా వేస్తూ జస్టిస్ కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, వెలగపూడి గ్రామానికి చెందిన మరియమ్మ 2020 డిసెంబరు 27న హత్యకు గురయ్యారు. ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తుళ్లూరు పోలీసులు నమోదు చేసిన కేసులో నందిగం నిందితుడిగా ఉన్నారు. అరెస్టయిన నందిగం సురేష్‌కు బెయిల్ ఇచ్చేందుకు కింది కోర్టు నిరాకరించింది. పోలీస్ కస్టడీ సైతం ముగిసినందున బెయిల్ ఇవ్వాలంటూ నందిగం వేసిన పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.



బాధ్యతలు చేపడుతున్న అనూరాధ

నోటిఫికేషన్లపై త్వరలో కీలక నిర్ణయం

- ఎపిపిఎస్‌సి ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనూరాధ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగాలకు సంబంధించి కొత్తగా ఇవ్వాల్సిన నోటిఫికేషన్లపై వీలైనంత త్వరగా కీలక నిర్ణయం తీసుకుంటామని ఎపిపిఎస్‌సి ఛైర్‌పర్సన్ ఎఆర్ అనూరాధ తెలిపారు. గురువారం ఉదయం విజయవాడలోని కమిషన్ ప్రధాన కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనూరాధతో కమిషన్ కార్యదర్శి జె ప్రదీప్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. బోర్డు సభ్యులు, కార్యదర్శితో పాటు ఇతర అధికారులు అభినందనలు తెలిపారు. అనంతరం ప్రస్తుతం పెండింగ్లో ఉన్న నియామకాలపై బోర్డు సభ్యులు, అధికారులతో ఛైర్‌పర్సన్ సమీక్షించారు. గ్రూప్-1, 2 సహా నిర్వహించాల్సిన పలు నియామక పరీక్షలు, ఇంటర్వ్యూలపైనా, ఉద్యోగాల భర్తీ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన ప్రతిపాదనలపైనా ఆరా తీశారు.

నిర్వాసితుల గళం... పూనెం సత్యనారాయణ

- సంతాప సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- విఆర్.పురం (అల్లూరి జిల్లా)

ప్రజాసమస్యలు, ముఖ్యంగా పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి పూనెం సత్యనారాయణ అలుపెరగని పోరాటాలు చేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కొనియాడారు. బుధవారం హఠాన్మరణం చెందిన సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు, పెద్దమట్టపల్లి మాజీ సర్పంచ్ పూనెం సత్యనారాయణ సంతాప సభ గురువారం రేఖపల్లిలో జరిగింది. సత్యనారాయణ భౌతికకాయానికి వి.శ్రీనివాసరావు సహా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నేతలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సంతాప సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సత్యనారాయణ అకాల మరణం పార్టీకి, ఆయన కుటుంబానికి తీరని లోటని అన్నారు. మండలంలో పార్టీ బలోపేతం కోసం, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ఆయన ఎంతో కృషి చేశారన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం 40 ఏళ్లపాటు పనిచేశారని వివరించారు. ఆయన కుటుంబం యావత్తు పార్టీలో, వివిధ పదవుల్లో ఉంటూ ప్రజా సేవ చేస్తోందని తెలిపారు. సత్యనారాయణ ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు అర్పించే ఘననివాళని పేర్కొన్నారు. ఆయన పోరాట వారసత్వాన్ని కుటుంబం ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నీతి, నిజాయితీ, పట్టుదల కలిగిన వ్యక్తిని కోల్పోయామన్నారు. పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సత్యనారాయణ గొప్ప పోరాట పటిమ కలిగిన నేతని, నేటి తరం ఆయనను స్ఫూర్తిగా తీసుకుని పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ సత్యనారాయణ క్రమశిక్షణ తో పార్టీలో, ప్రజా సంఘాల్లో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. ఆయన మృతి కార్మికోద్యమానికి తీరని లోటని అన్నారు. సభకు సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు అధ్యక్షత వహించారు.



సత్యనారాయణ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న వి.శ్రీనివాసరావు

అశేష జనవాహిని నడుమ అంతిమ యాత్ర

సంతాప సభ అనంతరం అశ్రు నయనాలతో అశేష జనవాహిని నడుమ సత్యనారాయణ అంతిమ యాత్ర రేఖపల్లి నుంచి నూతిగూడెం వరకు సాగింది. తమ నేతను కడసారి చూసేందుకు జనం భారీగా తరలివచ్చారు. సంతాప సభ, అంతియ యాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, నాయకులు మేకల నాగేశ్వరరావు, ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు ఎజె.రమేష్, గడ్డం స్వామి, బండారు శరత్, ఎంబి నరసారెడ్డి, ఎఐటియుసి తెలంగాణ నాయకులు సిహెచ్.సీతామహాలక్ష్మి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎపిఇపిడిసిఎల్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)



అవార్డు అందుకుంటున్న సిఎండి పృథ్వీతేజ్

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) మరో జాతీయ అవార్డు సొంతం చేసుకొంది. ఢిల్లీలో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన ఈ నెల 22, 23 తేదీలలో 18వ జాతీయ ఇంధన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంధన రంగంలోని వివిధ అంశాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సంస్థలకు '12వ ఇన్నోవేషన్ ఇంపాక్ట్ అవార్డ్స్ ఫర్ డిస్కమ్స్' పేరిట అవార్డులు ప్రదానం చేశారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు కొత్త ఆవిష్కరణలను రూపొందిస్తూ, నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్న ఎపిఇపిడిసిఎల్‌కు 'కేటగిరీ ఎఫ్ - ఇన్నోవేషన్ విత్ ఇంపాక్ట్ - లార్జ్ డిస్కమ్స్' విభాగంలో అవార్డు లభించింది. ఈ మేరకు న్యూఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ ది లలిత్‌లో బుధవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్‌కు ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అనిల్ రాజ్దన్ ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పృథ్వీతేజ్ మాట్లాడుతూ సంస్థ ఉద్యోగులు, సిబ్బంది ఉత్తమ పనితీరుకు నిదర్శనంగా సంస్థ ఈ జాతీయ అవార్డును సొంతం చేసుకుందని తెలిపారు. ఉద్యోగులు జవాబుదారీతనం, పారదర్శకతతో విధులు నిర్వహిస్తూ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలందించడం ద్వారా మరెన్నో అవార్డులను ముున్ముందు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంస్థ అధికారులకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.

సమస్యలపై నిలదీస్తారని డైవర్షన్ రాజకీయాలు

- వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- గుర్లలో డయేరియా బాధితులకు పరామర్శ
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున సాయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో వైఫల్యాలపైనా, అపరిష్కృతంగా పేరుకుపోతున్న సమస్యలపైనా ప్రజలు నిలదీస్తారన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగడుగునా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. అటువంటి రాజకీయాలను ఆపి డయేరియా బాధితులకు సాయం చేయాలని డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా గుర్లలో డయేరియాతో మృతి చెందిన వారి కుటుంబాలను ఆయన గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు వైసిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం జగన్ మీడియాతో మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసిందన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు గ్రామ సచివాలయంలో పంచాయతీరాజ్, విద్యా శాఖ, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, అగ్రికల్చర్, సర్వే, పశు సంవర్ధకశాఖ, విలేజ్ క్లినిక్‌లలో వైద్యులు, ఎఎన్ఎంలు, గ్రామాల్లో ఆశా వర్కర్లు ఎంతో సమన్వయంతో పని చేసేవారని తెలిపారు. నేడు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్-6 పథకాలను కూడా అమలు చేయడం లేదని తెలిపారు. వీటిన్నింటిపైనా ప్రజలు నిలదీయాలని అన్నారు. గ్రామ స్వరాజ్యం ఎలా నాశనమైందో అని చెప్పడానికి గుర్ల గ్రామంలో డయేరియాతో 14 మంది మరణాలే ఉదాహరణ అని పేర్కొన్నారు. డయేరియా మరణాలపై అక్టోబరు 19న తాను ట్వీట్ చేస్తే తప్ప, ప్రభుత్వం స్పందించలేదన్నారు. మార్చి నుంచి ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం తో సుమారు రూ.1800 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. దీంతో, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోగులు ఉచితంగా వైద్యసేవలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు తమ ప్రభుత్వం ఒకేసారి 17 మెడికల్ కాలేజీలు మొదలుపెట్టి, వాటిలో 5 కాలేజీలను గతేడాది ప్రారంభించిందని తెలిపారు. మిగిలిన 12 మెడికల్ కాలేజీలను పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. వాటిలో 5 కాలేజీల్లో సీట్లు మంజూరైతే వాటిని నిర్వహించలేమని లేఖ రాసిందని విమర్శించారు. వీటన్నింటికీ సమాధానాలు చెప్పలేక చివరకు తన చెల్లెలకు, తనకు మధ్య కూడా గొడవలు సృష్టిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు, మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, పి.పుష్పశ్రీవాణి, మాజీ ఎంపిలు విజయసాయిరెడ్డి, బెల్లాన చంద్రశేఖర్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ ఎమ్మెల్యేలు కోలగట్ల వీరభద్రస్వామి, బొత్స అప్పలనర్సయ్య, ధర్మాన కృష్ణదాస్, గొర్లె కిరణ్, రెడ్డి శాంతి, తదితరులు పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ముప్పాళ్ల (పల్నాడు జిల్లా)



శ్రీనివాసరావు (ఫైల్)

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలంలో గురువారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మాదల గ్రామానికి చెందిన ఉగ్గం శ్రీనివాసరావు (43) ఏడెకరాలు కౌలుకు పొలం తీసుకున్నారు. పత్తి, మిరప, వరి పంటలను సాగు చేశారు. ప్రతి సంవత్సరం కౌలు వ్యవసాయం నష్టాలతో సాగు తున్నప్పటికీ తేరుకుంటాననే ఉద్దేశంతో ఈ ఏడూ కౌలు వ్యవసాయం చేపట్టారు. అధిక వర్షాలు, ప్రతికూల పరిస్థితులతో పంట చేతికి రాకపోగా అప్పులు మిగిలాయి. దీనికి తోడు గత ఐదేళ్లగా వ్యవసాయంలో చేసిన అప్పులు కలిపి మొత్తం రూ.15 లక్షలు తేలాయి. దీంతో మానసిక ఒత్తిడికి లోనైన శ్రీనివాసరావు బుధవారం రాత్రి పశువుల పాక వద్ద పురుగుల మందుతాగి పడిపోయారు. గురువారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య గంగమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.


అదుపులోకొచ్చిన డయేరియా

- మరణాలపై విచారణ
- హోంశాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/గుర్ల

విజయనగరం జిల్లాలో ఇకపై డయేరియాతో ఏ ఒక్కరూ మరణించకూడదని, అటువంటి మరణాలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను హెచ్చరించారు. డయేరియా ప్రస్తుతం అదుపులోకి వచ్చిందని, మరణాలపై విచారణ చేపడుతున్నామని తెలిపారు. డయేరియా విజృంభించి పలువురు మృతి చెందిన నేపథ్యంలో గుర్ల గ్రామంలో గురువారం ఆమె పర్యటించి బాధితులను పరామర్శించారు. కాలువలను, తాగునీటి పైప్ లైన్లను, పారిశుధ్యాన్ని పరిశీలించారు. భూగర్భ జలాల కలుషితం గురించి ఆరా తీశారు. అనంతరం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ వర్షాకాలం అనగానే డయేరియా, సీజనల్ వ్యాధులు సాధారణంగా వస్తాయని, ముందస్తు చర్యలతో వాటిని నివారించాలని తెలిపారు. వచ్చే పది రోజులు అన్ని వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచి, క్లోరినేషన్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కృష్ణా, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో చాలా మంది డయేరియాతో చనిపోయారని, ఏ రోజూ వారిని పరామర్శించ లేదని విమర్శించారు.

జగన్ నష్ట పరిహారం ప్రకటిస్తున్నారేగానీ ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. తల్లికి, చెల్లికి విలువ ఇవ్వనివారు రాష్ట్ర ప్రజలకు ఏమి విలువ ఇస్తాడని నిలదీశారు. సొంత బాబాయిని చంపేసి, సొంత చెల్లితో రాజకీయం చేశాడని విమర్శించారు. రాజకీయాలకు పనికి రానీ ఏకైక వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.



డయేరియా బాధితులతో మాట్లాడుతున్న మంత్రి అనిత

విద్యార్థుల్లో కళా నైపుణ్యానికి వేదికగా యువజనోత్సవాలు

- ఆచార్య నాగార్జున వర్సిటీలో ఘనంగా ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా 2024-2025 యువజన ఉత్సవాలు గురువారం వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు మ్యూజిక్, నృత్య విభాగంలో పోటీలు నిర్వహించారు. యువజన ఉత్సవాల కో ఆర్డినేటర్ ఆచార్య ఎస్ మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన సభలో వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె గంగాధరరావు మాట్లాడుతూ విద్యతోపాటు అదనంగా క్రీడలు, కళా రంగాలపై విద్యార్థులు దృష్టి సారించినట్లయితే పరిపూర్ణ జీవితాన్ని పొందగలుగుతారని పేర్కొన్నారు. కళా రంగంలో ప్రతిభ ఉన్నవారికి అనేక రకాల విజయాలు సొంతమవుతాయని అన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు థియేటర్, సినీ ఆర్టిస్టు, పారిశ్రామికవేత్త డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు మాట్లాడుతూ భావితరాలకు నేటి విద్యార్థులు పునాదిరాళ్లు వంటి వారని పేర్కొన్నారు. రెక్టార్ ఆచార్య కె రత్న షీలా మణి మాట్లాడుతూ విద్యార్థులు మూడ్రోజుల ఈ ఉత్సవాలలో సాంస్కృతిక, సాహిత్య, కళ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు వేదికగా చేసుకోవాలని సూచించారు. క్లాస్‌రూమ్‌లో విద్యార్థిని మాత్రమే చూస్తామని, ఇటువంటి వేడుకల ద్వారా ఆ విద్యార్థుల్లో ఉన్న కళాకారులను, క్రీడాకారులను చూస్తామని పేర్కొన్నారు. యువజనోత్సవాల కో-ఆర్డినేటర్ ఆచార్య ఎస్ మురళీమోహన్ మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో 30 కళాశాల నుంచి విద్యార్థులు ఈ యువజన ఉత్సవాలలో పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం అడిషనల్ కో- ఆర్డినేటర్ ఆచార్య పి జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో రోగులను విచారిస్తున్న కృష్ణబాబు

రుయాను మరింత అభివృద్ధి చేస్తాం

- ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

రాయలసీమలో అతిపెద్ద ఆస్పత్రిగా పేరు గడించిన రుయా ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టి.కృష్ణబాబు తెలిపారు. తిరుపతి పర్యటనలో భాగంగా గురువారం ఆయన తిరుపతి రుయా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రుయా ఆస్పత్రిలో శానిటరీ, సెక్యూరిటీ సిబ్బందికి వేతనాలు సక్రమంగా అందడంలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. మహాప్రస్థానం మరొకటి అవసరమని కలెక్టర్ కోరారని, సాంకేతికతో కూడిన వైద్య పరికరాల మరికొన్ని అవసరమని గుర్తించామని తెలిపారు. ఇప్పటికే రూ.90 కోట్లు పిజి సీట్ల కోసం విడుదల చేశామని, అందులో రూ.15 కోట్లు వైద్య పరికరాలు తీసుకునేందుకు వాడుకోవచ్చని చెప్పారు. రోగులకు మరింత మెరుగైన సౌకర్యాలు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, ఎస్‌విఎంసి ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, ఆర్ఎంఒ డాక్టర్ హరికృష్ణ, వైద్య అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల కనిష్టానికి భారత కంపెనీల రెవెన్యూ

- క్రిసిల్ అంచనా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత కంపెనీల రెవెన్యూ వృద్ధి 5-7 శాతానికి పరిమితం కావొచ్చని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ అంచనా వేసింది. ఇది నాలుగేళ్ల కనిష్టమని పేర్కొంది. నిర్మాణ రంగంలో నెలకొన్న స్తబ్దతనే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. మొత్తం భారత కంపెనీల రెవెన్యూలో నిర్మాణ రంగం 20 శాతం వాటా కలిగి ఉంటుందని తెలిపింది. ఈ రంగానికి సంబంధించిన అనుబంధ పెట్టుబడుల్లోనూ ఒత్తిడి నెలకొందని క్రిసిల్ పేర్కొంది. 435 కంపెనీలను ఖాతాలను విశ్లేషించి ఈ రిపోర్ట్‌ను రూపొందించినట్లు పేర్కొంది. విద్యుత్, స్టీల్, సిమెంట్, ముడి సరుకుల డిమాండ్‌లో స్తబ్దత చోటు చేసుకుందని విశ్లేషించింది. ఇంతక్రితం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 8.3 శాతం వృద్ధి చోటు చేసుకుందని వెల్లడించింది.

సంపాదకీయం


బ్రిక్స్ సందేశం

రష్యాలోని కజాన్ నగరంలో మూడ్రోజుల పాటు జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ప్రపంచానికి సంతోషకరమైన సందేశాన్నిచ్చింది. అమెరికాకు మాత్రమే దోహదపడే డాలర్ ఆధిపత్య ఆర్థిక వ్యవస్థకు ముకుతాడు వేసే చర్చలతో మరొక అడుగు ముందుకేసింది. దేశాల మధ్య నెలకొన్న వివాదాల పరిష్కారానికి సంభాషణలూ, దౌత్య సంబంధాలే దారి చూపిస్తాయని గట్టిగా పునరుద్ఘాటించింది. ఈ వేదికపై మాట్లాడిన దేశాధినేతలు పరస్పర సహకారం గురించి, వాణిజ్యంలో జాతీయ కరెన్సీ చెల్లుబాటు గురించి, ప్రపంచశాంతి గురించి, ఐక్యరాజ్య సమితి బలోపేతం కావటం గురించీ మాట్లాడడం హర్షణీయం. త్వరితగతిన ఆచరణకు పూనుకోవాల్సిన బృహత్తర కర్తవ్యం కూడా! పనిలో పనిగా సరిహద్దు వివాదాల పరిష్కారానికి భారత్ – చైనాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందం కుదరటం స్వాగతించదగినది.

సోషలిస్టు సోవియట్ యూనియన్ పతనం తరువాత అమెరికా ఏకపక్ష ధోరణికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. యూరప్ దేశాలన్నీ ఒక సమాఖ్యగా ఏర్పడి, మారకద్రవ్యంగా యూరోని రంగంలోకి తీసుకొచ్చినా – అమెరికా దొంగాటలో అది ఎక్కువ కాలం నిలవలేకపోయింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచంలో దాదాపు సగం జనాభాకి, 30 శాతం భూభాగానికి ప్రాతినిధ్యం వహిస్తూ 2009 జూన్‌లో బ్రిక్ ఏర్పడింది. ఇందులో తొలుత బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా సభ్యదేశాలు కాగా, తరువాత దక్షిణాఫ్రికా కూడా చేరి, బ్రిక్స్‌గా మారింది. కేవలం మారకద్రవ్యంగా ఉన్న డాలర్ ... ఆ కారణంతోనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో తీవ్ర పెత్తనం చెలాయించటాన్ని ఈ కూటమి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. యుద్ధాలతో, ఆయుధాల అమ్మకాలతో, అక్రమ చొరబాట్లతో ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తున్న అమెరికాకు ఈ కూటమి ఏర్పాటు పెద్ద అడ్డగింత. బ్రిక్స్ ఏర్పడ్డాక ఉమ్మడి కరెన్సీ లేకపోయినా, జాతీయ ద్రవ్యం పరస్పర మార్పిడితో వాణిజ్యం కొనసాగిస్తున్నాయి. బ్రిక్స్ దేశాల మధ్య దాదాపు 65 శాతం లావాదేవీలు డాలర్ ప్రమేయం లేకుండానే సాగటం కూటమి విజయానికి ఒక సంకేతం. ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో అమెరికా ఏకపక్షంగా రష్యా మీద ఆర్థిక ఆంక్షలు విధించినా, అవి ఏ మాత్రం ప్రభావం చూపించలేకపోయాయి. చమురు సరఫరా వంటి ఒప్పందాల ద్వారా రష్యా, చైనా, భారత్ దేనికదే ఆర్థిక ప్రయోజనాన్ని పొందాయి. ఒక కూటమిగా ఉండడమంటే– భాగస్వామ్య దేశాలన్నీ సమాన గౌరవం ఇచ్చిపుచ్చుకోవడం అన్న దృక్పథానికి బ్రిక్స్ నిదర్శనంగా నిలుస్తోంది. భౌగోళిక రాజకీయ వ్యూహాలు, వాణిజ్య అవసరాలు ఇత్యాది కారణాలతో పాటు సమాన గౌరవ భాగస్వామ్యం పొందే ఆకాంక్షతో ఇప్పుడు చాలా దేశాలు బ్రిక్స్ వైపు చూస్తున్నాయి. ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇప్పటికే భాగస్వాములయ్యాయి. ఇంకో 23 దేశాలు చేరటానికి దరఖాస్తు చేసుకున్నాయి. రానున్న కొద్దికాలంలో 130 దేశాల వరకూ ఈ కూటమిలోకి రావొచ్చని అంచనా.

బ్రిక్స్ దేశాల పరిభాష సామ్రాజ్యవాద దేశాల కూటముల భాష కన్నా భిన్నంగా, ప్రజాస్వామికంగా వినిపిస్తోంది. పరస్పర సహకారం, గౌరవం, అభివృద్ధి, యుద్ధ వ్యతిరేకత ఈసారి డిక్లరేషన్‌లో స్పష్టంగా ధ్వనించింది. "ఉగ్రవాదం ప్రపంచానికి శత్రువు. అది ఒక మతానికో, జాతికో, ప్రాంతానికో సంబంధించినది కాదు. అది ఎక్కడ, ఏ రూపంలోలో ఉన్నా ఖండించాల్సిందే, ఉమ్మడిగా ఎదుర్కోవల్సిందే!" అని కజాన్ ప్రకటన పేర్కొంది. వనరులపరంగా, మార్కెట్లపరంగా పుష్కలమైన అవకాశాలున్న బ్రిక్స్ దేశాల మైత్రి, పరస్పర సహకార సంబంధాలూ ఖచ్చితంగా ప్రపంచ ప్రగతికి దోహదపడతాయి. ఈ సదస్సులో ప్రస్తావించినట్టుగానే సరిహద్దు, పర్యావరణ సమస్యలకు మంచి పరిష్కారాన్ని కనుగొనటం, నిష్పక్షపాతమైన వైఖరితో వ్యవహరించటం చాలా అవసరం. ఈ వేదిక సాక్షిగానే ప్రధాని మోడీ – సరిహద్దు, ఇతరత్రా సమస్యల పరిష్కారానికి చర్చలూ, దౌత్యమార్గాలే పరిష్కారం అని పేర్కొనటం ముదావహం. భారత్ – చైనాల మధ్య సరిహద్దు అంశాలపై కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందం, సామరస్య భావన ఆచరణలోనూ మంచి ఫలితాలు ఇవ్వాలని ఆశిద్దాం. యుద్ధాలను ఎగదోయటమే తమ వృద్ధి మార్గంగా నడుస్తున్న ఆధిపత్య దేశాలకు బ్రిక్స్ విస్తరణ, కార్యాచరణ ఒక ప్రత్యామ్నాయ సమాధానం కావాలి!


మహనీయుల మాట



కోపం మాటల్లో వుండాలి...
మనసులో కాదు!
ప్రేమ మాటల్లోనే కాదు...
మనసు లోనూ వుండాలి!
– రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి.

జమిలి ఎన్నికలు–అసంబద్ధ వాదనలు–అతకని సమర్థనలు!

విశ్లేషణ





ఎం. కోటేశ్వరరావు

జమిలి ఎన్నికల గురించి తన ఎజెండాను అమలు జరిపేందుకు బిజెపి పూనుకుంది. ఆ విధానాన్ని వ్యతిరేకించే పార్టీలు తమ వైఖరిని మరోసారి స్పష్టం చేశాయి. గోడ మీది పిల్లులు ఎటు వాటంగా ఉంటే అటు దూకాలని చూస్తున్నాయి!

జమిలి ఎన్నికల ప్రతిపాదనలో ప్రజాస్వామ్యం ఎక్కడుంది? కేంద్ర ప్రభుత్వం ముందుగానే ఒక నిర్ణయం తీసుకొని దాన్ని ఎలా అమలు జరపాలో సూచించండి అంటూ ఒక కమిటీని వేసింది. రోగి కోరుకున్నదే వైద్యుడు ఇచ్చాడన్నట్లు చేసిన సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు, పార్టీలతో చర్చించి ఒక బిల్లును పెట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇదేమి ప్రజాస్వామ్యం? ప్రపంచంలో ఎక్కడైనా ఉందా? కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ 2023 సెప్టెంబరు రెండున తీసుకున్న నిర్ణయం ప్రకారం మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి కమిటీని వేశారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకుగాను ఆ సమస్యను పరిశీలించి సిఫార్సులు చేసేందుకు ఉన్నత స్థాయి కమిటీని వేసినట్లు న్యాయశాఖ తీర్మానంలో ఉంది. దాని అర్థం ఏమిటి? ముందే తీసుకున్న నిర్ణయాన్ని ఎలా అమలు జరపాలో చెప్పమని కోరటమే కదా?

2014 నుంచి కేంద్రంలో నిరాటంకంగా పాలన కొనసాగుతున్నది. ఒకే ప్రభుత్వం ఉంది. అది ప్రకటించిన మేకిన్ ఇండియా, మేక్ ఇండియా విధానాలు ఎందుకు విఫలమైనట్లు? మన ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఎందుకు జరుగుతున్నట్లు? దీనికోసం సిద్ధాంత గ్రంథాలు రాయనక్కర లేదు. బిజెపి వారే చెబుతున్నట్లు రెండింజన్ల పాలిత రాష్ట్రాలే ఎక్కువ. అక్కడ గానీ, ఇతర పార్టీల రాష్ట్రాలలో గానీ పదేళ్లలో ఎక్కడైనా మధ్యంతర ఎన్నికలు వచ్చి ఆటంకం కలిగిందా అంటే లేదు. అభివృద్ధి చెందిన దేశాల చరిత్రను చూసినపుడు అనేక అంశాలతో పాటు పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ అండ్ డి)కి భారీ మొత్తాలలో ఖర్చు చేయటం తెలిసిందే. మోడీ పాలనలో ఆవు పేడ, మూత్రంపై పరిశోధనల పట్ల చూపిన శ్రద్ధ మరొకదాని మీద లేదు. ఇటీవలనే కేంద్ర ప్రభుత్వ శాస్త్రీయ ప్రధాన సలహాదారు అజయ్ కుమార్ సూద్ చెప్పిందేమిటి? 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "2047లో మనం ఎక్కడ ఉండాలని మీరు నన్ను అడిగితే సైన్సుకు సంబంధించి సర్వత్రా వినియోగిస్తున్న సూచికల ప్రకారం మనం ఎగువన మూడు లేదా ఐదవ స్థానంలో ఉండాలి. నిజానికి మనం మూడవ స్థానంలో ఉండాలి. ఒక దేశ శాస్త్రీయ ప్రతిష్టను కొలిచేందుకు అన్ని చోట్లా వినియోగించే సూచికలను చూసినపుడు మనం చాలా వెనుకబడి ఉన్నాం. ప్రపంచ సగటు కంటే తక్కువ" అన్నారు. ఈ సూచికలను మెరుగు పరచాలంటే ఆర్ అండ్ డి మీద పెట్టే మొత్తం ఖర్చు పెరగాలి. పరిశోధనలు, శాస్త్రీయ అంశాలలో మహిళలు, పేటెంట్ల వంటివి పెరగాలని కూడా చెప్పారు. అనేక చర్చల తరువాత...వచ్చే ఐదేళ్ల కాలంలో 600 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తామని, అందుకోసం జాతీయ పరిశోధనా ఫౌండేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు 2023లో ప్రకటించారు. అనేక మంది నిజమే కదా అని సంతోషించారు. ఆ తర్వాత పాఠ్య పుస్తకాల నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని, కొన్ని శాస్త్రీయ అంశాలను తొలగించారు. ఇదేదో అమాయకంగా చేశారని అనుకుంటే పొరపాటు. కరోనా నిరోధానికి గిన్నెలు మోగించాలని, కొవ్వొత్తులు వెలిగించాలని, గంగలో మునగాలని చెప్పిన పెద్దలకు ఇన్నేళ్ల తరువాతైనా జ్ఞానోదయం అయిందని చాలా మంది సరిపెట్టుకున్నారు. ఆదిలోనే హంసపాదు అన్నట్లు 2023–24 బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం ఎంతో తెలుసా? ఏటా సగటున 120 కోట్ల డాలర్లు కేటాయించాల్సి ఉండగా కేవలం 3.09 కోట్ల డాలర్లు మాత్రమే. దశాబ్దాల తరబడి విధానాలను రూపొందించ లేకపోవటమే కాదు, దానికి తగిన కేటాయింపులూ లేవు. 1990 దశకంలో జిడిపిలో 0.8 శాతం ఉండగా 2023 నాటికి 0.65 శాతానికి తగ్గాయి. కబుర్లు మాత్రం రెండు శాతం ఉండాలని చెబుతారు. మన పాలకులు మాత్రం 2047 నాటికి వికసిత భారత్‌కు జమిలి ఎన్నికలే జిందా తిలిస్మాత్ అంటే జనం చెవుల్లో కమలం పూలు పెట్టటం తప్ప మరొకటి కాదు.

1952 నుంచి 1967 వరకు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిగాయి. అప్పుడేమీ దేశం గంతులు వేస్తూ అభివృద్ధి చెందిన దాఖలాలేమీ లేవు. విదేశీ చెల్లింపుల సంక్షోభం, రూపాయి విలువ తగ్గింపు, ఐఎంఎఫ్ రుణం, ధరల పెరుగుదల తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెస్ ఓటమి, కాంగ్రెస్‌లో చీలికతో 1971లో లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు, రాష్ట్ర ప్రభుత్వాల పతనం వంటి పరిణామాలన్నీ జరిగాయి. జస్టిస్ బి.పి.జీవన్ రెడ్డి నాయకత్వంలోని లా కమిషన్ 1999–2000లో ఖర్చు తగ్గింపు, పాలన మెరుగుదలకు జమిలి ఎన్నికల గురించి పరిశీలించాలని చెప్పింది తప్ప అభివృద్ధికి ముడిపెట్టలేదు. ఇంత పెద్ద దేశానికి ఓటర్లకు, ఓట్ల పెట్టెలకు రక్షణ లేని ఈ దేశంలో ఎన్నికల సమయంలో భద్రతా సిబ్బంది నియామకం, ఎన్నికల సిబ్బందికి అయ్యే ఖర్చు పెద్ద సమస్య కాదు. దాన్నే భూతద్దంలో చూపి ఆ కారణంగానే దేశం వృద్ధి చెందటం లేదంటున్నారు. నియంతలు పాలించిన అనేక దేశాల్లో దశాబ్దాల తరబడి ఒకే పాలన సాగింది. ఎలాంటి ఇబ్బందులు లేవు. అయినా అవేవీ వృద్ధి చెందలేదు. జపాన్‌లో రెండవ ప్రపంచ యుద్ధం తరువాత 26 సార్లు పార్లమెంటు ఎన్నికలు జరిగాయి, 38 మంది ప్రధానులు మారారు. అది గత కొన్ని దశాబ్దాలుగా పక్షవాత రోగి మాదిరి దాని అర్థిక వ్యవస్థ ఉంది. అభివృద్ధి నమూనాగా ఒకప్పుడు జపాన్‌ను చెప్పారు. దాన్ని చూసి నేర్చుకోవాలన్నారు. దాని పరిస్థితి ఏమిటి? 2012లో జిడిపి ఆరు లక్షల కోట్ల డాలర్లు దాటింది. ఇప్పుడు నాలుగు లక్షల కోట్లకు పడిపోయింది.

రామనాధ్ కోవింద్ కమిటీ దక్షిణాఫ్రికా, జర్మనీ, స్వీడన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, జపాన్, బెల్జియం దేశాలలో జమిలి ఎన్నికల గురించి అధ్యయనం చేసింది. అక్కడ ఏక కాలంలో జరిగే వాటిని మాత్రమే తీసుకుంది తప్ప దామాషా ప్రాతిపదికన ప్రతి ఓటుకూ విలువనిచ్చే నిజమైన ప్రజాస్వామిక పద్ధతిని సిఫార్సు చేయకుండా వదలివేసింది. వాటిని గమనించినట్లు మాత్రం పేర్కొన్నది. ఎందుకుంటే సిఫార్సు చేస్తే బిజెపికి ఆగ్రహం వస్తుంది గనుక. ప్రపంచంలో జమిలి ఎన్నికలు జరుగుతున్నవి మూడే మూడు దేశాలు–అవి స్వీడన్, బెల్జియం, దక్షిణాఫ్రికా. ఈ మూడు చోట్లా దామాషా ప్రాతిపదికన ఎన్నికలు జరుగుతున్నాయి. మరి ఈ విధానాన్ని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు. ఇటీవల ఎన్నికలు జరిగిన దక్షిణాఫ్రికాలో 64 లక్షలు (40 శాతం) ఓట్లు తెచ్చుకున్న పార్టీకి 200కు గాను 73 సీట్లు వస్తే కేవలం 29 వేలు తెచ్చుకున్న పార్టీకి ఒక సీటు వచ్చింది. ప్రతి ఓటుకూ విలువ ఇచ్చే అసలు సిసలు ప్రజాస్వామ్యం అంటే ఇది కదా! కానీ మన దేశంలో జరుగుతున్నదేమిటి? పార్టీలు తెచ్చుకున్న ఓట్లకు, సీట్లకు పొంతన ఉంటోందా? 2019లో బిజెపికి వచ్చిన ఓట్లు 37.36 శాతమైతే, సీట్లు 55.8 శాతం. అదే 2024లో ఓట్లు 36.56 శాతం కాగా, సీట్లు 44 శాతం వచ్చాయి. మైనారిటీ ఓట్లతో అధికారాన్ని పొందింది.

> **జమిలి ఎన్నికలు సర్వరోగ నివారణి జిందా తిలిస్మాత్ అనుకుంటే నాడు అధికారంలో ఉన్న వాజ్‌పేయి ఎందుకు చొరవ తీసుకోలేదు. పోనీ 2014లోనే గద్దెనెక్కిన నరేంద్రమోడీ వెంటనే దీన్ని ఎందుకు ముందుకు తేలేదు? దేవుడు నైవేద్యం తినడని పూజారికి తెలిసినంతగా మరొకరికి తెలియదు. అలాగే తన పాలన వైఫల్య దిశగా పోతున్నదని అందరి కంటే ముందుగా గ్రహించిన వ్యక్తి మోడీ. ప్రతి ఎన్నికలలోనూ పాతదాన్ని వదిలి కొత్త నినాదాన్ని ముందుకు తేవటం తెలిసిందే. అధికార యంత్రాంగ సమయం, డబ్బు వృధాను అరికట్టటానికి ఒకేసారి ఎన్నికలని మరొక పాట పాడుతున్నారు.**

ఎన్నికల్లో డబ్బు ప్రమేయం ఎలా పెరిగిపోయిందో చూస్తున్నాము. డబ్బున్న పార్టీలు ఓట్లను టోకుగా కొనుగోలు చేయటం తప్ప మరొకటి జరుగుతోందా? ఉదాహరణకు రెండు తెలుగు రాష్ట్రాల్లో పరిమితంగా పోటీ చేస్తున్న కమ్యూనిస్టులు తప్ప ఓటర్లకు డబ్బు పంచని పార్టీ ఏది? దాని ప్రమేయం లేకుండా ఎందుకు చేయరు? ఎన్నికల విధానాన్ని ఎందుకు సంస్కరించరు? బిజెపికి ఇవేవీ తెలియనంత అమాయకంగా ఉందా? ఎన్నికల కమిషన్ తొలి సాధారణ ఎన్నికల్లో ప్రతి ఓటుకు చేసిన ఖర్చు రూ.0.60 కాగా 2014లో ఆ మొత్తం రూ.46.40కి పెరిగింది. తొలి సాధారణ ఎన్నికల్లో ఒక అభ్యర్థి రూ.25 వేలకు మించి ఖర్చు చేయకూడదని చెప్పిన ఎన్నికల కమిషన్ తాజాగా దాన్ని రూ.75 నుంచి 95 లక్షల వరకు పెట్టవచ్చని, అసెంబ్లీ అభ్యర్థులకు రూ.28 నుంచి రూ.40 లక్షల వరకు పెంచింది. లెక్క చూపకుండా చేసే ఖర్చు గురించి తెలిసిందే. వీటిని పరిగణనలోకి తీసుకొని సి.ఎం.ఎస్ అనే సంస్థ వేసిన లెక్క ప్రకారం 2019లో ఒక్కో ఓటు ఖర్చు రూ.700 కాగా 2024 రూ.1,400కు పెరిగింది. 1998లో ఎన్నికల ఖర్చు రూ.9,000 కోట్లు కాగా అది 2024లో రూ.లక్షా 35 వేల కోట్లకు పెరిగినట్లు అంచనా? దీన్ని నివారించటానికి కమిటీ వేయాల్సిన అవసరం లేదా?

జమిలి ఎన్నికలు జరపాలని బిజెపి చెబుతున్నది. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించిన ఘనత తమదే అని జబ్బలు చరుచుకుంటున్నది. కానీ ఆచరణలో ఎక్కడా ఆ స్ఫూర్తి కనిపించటం లేదు. రిజర్వేషన్ల బిల్లును ఆమోదించిన తరువాత జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఎక్కడా మూడోవంతు సీట్లకు ఆ పార్టీ మహిళలను నిలపలేదు. బిజెపి తాను పోటీ చేసిన 446 స్థానాల్లో కేవలం 69 మందిని 15.47 శాతం మందినే నిలిపింది. బిజెడి ఒడిషాలో 33 శాతం మందిని నిలిపింది. అసలు 150 స్థానాల్లో మహిళా అభ్యర్థులే లేరు. గత లోక్‌సభలో అన్ని పార్టీల తరపున 78 మంది గెలిస్తే ఈసారి 73కు తగ్గారు. అదే విధంగా తాను తన మిత్ర పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసి లోక్‌సభతో పాటే ఎన్నికలు జరిపించి ఉంటే ఆదర్శంగా ఉండేది. ఆ పార్టీ చెబుతున్నట్లు దాని వలన కలిగే లాభాలేమిటో ఎందుకు చూపలేదు? దానికి రాజ్యాంగ సవరణలతో పని లేదు కదా! బిజెపికి, చివరికి ఎన్నికల కమిషన్‌కూ చిత్తశుద్ధి లేదు. గతంలో హర్యానా, మహారాష్ట్రలకు ఒకేసారి ఎన్నికలు జరిగితే ఈ సారి బిజెపికి అనుకూలంగా ఉండేందుకు మహారాష్ట్ర ఎన్నికలను విడిగా జరుపుతున్నారు. రెండు రాష్ట్రాలూ బిజెపివే గనుక ఆరు నెలల కంటే తక్కువే వ్యవధి ఉన్నందున వాటినైనా రద్దు చేసి లోక్‌సభతో పాటు ఎన్నికలు జరపవచ్చు. అదే విధంగా ఎప్పుడో జరగాల్సిన కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను లోక్‌సభతో పాటు ఎందుకు జరపలేదంటే సరైన సమాధానం లేదు.

జమిలి ఎన్నికలు సర్వరోగ నివారణి జిందా తిలిస్మాత్ అనుకుంటే నాడు అధికారంలో ఉన్న వాజ్‌పేయి ఎందుకు చొరవ తీసుకోలేదు. పోనీ 2014లోనే గద్దె నెక్కిన మోడీ వెంటనే దీన్ని ఎందుకు ముందుకు తేలేదు? దేవుడు నైవేద్యం తినడని పూజారికి తెలిసినంతగా మరొకరికి తెలియదు. అలాగే తన పాలన వైఫల్య దిశగా పోతున్నదని అందరి కంటే ముందుగా గ్రహించిన వ్యక్తి మోడీ. ప్రతి ఎన్నికలలోనూ పాతదాన్ని వదిలి కొత్త నినాదాన్ని ముందుకు తేవటం తెలిసిందే. అధికార యంత్రాంగ సమయం, డబ్బు వృధాను అరికట్టటానికి ఒకేసారి ఎన్నికలని మరొక పాట పాడుతున్నారు. కోవింద్ కమిటీ చేసిన సూచనలలో ఏ కారణంతోనైనా ఒక ప్రభుత్వం పడిపోతే జరిగే ఎన్నికలు ఐదేళ్లలో మిగిలిన కాలానికి మాత్రమే అన్నది ఒకటి. సంక్షోభంతో ఐదేళ్లలో ఎన్నిసార్లు పతనమైతే అన్ని సార్లు జరుపుతారా? జమిలి ఎన్నికల చర్చ జరుగుతుండగానే దాని స్ఫూర్తిని దెబ్బ తీసేదిగా కేంద్ర ఎన్నికల సంఘం గతంలో ఒకేసారి జరిగిన హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలను ఈసారి విడదీసింది. మరోవైపు జమిలిని వ్యతిరేకించే పార్టీలకు నీతులు చెబుతున్నారు.? పదేళ్ల మోడీ విఫల పాలన నుంచి జనం దృష్టిని మళ్లించేందుకు తప్ప జమిలి ఎన్నికలు మరొక మేలుకు కాదన్నది స్పష్టం. "మీరు కొంత కాలం జనాలందరినీ వెర్రి వారిగా చేయగలరు. కొంత మందిని కొంత కాలం చేయగలరు. అందరినీ ఎల్లకాలం వెర్రివారిని చేయలేరు." అన్న అబ్రహం లింకన్ మాట మోడీజీ మరచినట్టున్నారు.

★


వందనాలు

రైతన్నా
నీకు సలామన్నా
ఎన్ని కష్టాలయ్యా నీకు
ఎన్ని పరీక్షలయ్యా నీకు
అన్నిటినీ సహిస్తావు
చిరునవ్వుతో బాధల్ని
దిగమింగేస్తావు
నీ ఆశలు ఆవిరౌతున్నా
అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా
ఏ సాయం అందకపోయినా
వ్యవసాయం మానవు
నీ కర్తవ్య దీక్షను వీడవు
నీ విశ్వకల్యాణ దృక్పథాన్ని
అదేమిటో గాని ఒక్కరూ
మెచ్చుకోరు పట్టించుకోరు
నాగలే నీ దైవం
పొలమే నీ కార్యక్షేత్రం
వానచినుకులే నీ బంధువులు
పైరులే నీ బిడ్డలు
నీ కళ్ళ ముందే వ్యాపారులు
కుబేరులైపోతుంటే
ఆకాశహర్మ్యాల్లో నివసిస్తుంటే
నువ్వింకా అక్కడే ఉన్నావు
నీ బతుకులో పొద్దుపొడుపు
పొడవలేదు...అయినా
నిరాశ చెందవు ముందుకే సాగుతావు
రైతన్నా! నీవు లేకుంటే
రాజ్యమేది? భోగమేది?
బతుకేది? మనుగడేది?
నీ త్యాగానికి వందనాలు
నీలోని మానవత్వానికి
అక్షర నీరాజనాలు.

– మంకు శ్రీను,
సెల్ : 9347100598

న్యాయం కళ్లు తెరిచిందా!

> **కళ్లకు గంతలు తీసిన దేవతకు నిజాల్ని చూసి తీర్పులిచ్చే ధైర్యం వస్తుందా! ఈ అసమ సమాజంలో న్యాయం ఎవరి పక్షం వహించాలో న్యాయ వ్యవస్థకు ముందుగానే తెలుసు. న్యాయ చట్టాలను మార్చి, సంస్కృత పేర్లతో వాటిని పిలిచినపుడే ఏదో మార్పుకు మార్గం వేస్తున్నారని సంకేతించారు. ఇప్పుడు భారతీకరించిన మను ధర్మాన్నే న్యాయంగా తెచ్చేందుకు పూనుకునే ప్రమాదం ఉంది. అప్రమత్తంగా వేచిచూడాలి!**



'కావున లోకపుటన్యాయాలు, కాల్చే ఆకలి కూల్చే వేదన దారిద్ర్యాలూ దౌర్జన్యాలూ, పరిష్కరించే, బహిష్కరించే' మార్పేనా ఇది! న్యాయాన్ని బొమ్మను చేసి కలిగించే న్యాయం కళ్లు తెరిచిందని, చేతిలో రాజ్యాంగాన్ని సమ కూర్చుకుందని సంబర పడేందుకు సందర్భమేనా ఇది! న్యాయవాదులూ న్యాయస్థానాలూ ఉన్నాయంటేనే, వాటి అవసరం పెరుగు తున్నదంటేనే అన్యాయాలు విస్తరిస్తున్నాయని అర్థం. చాలా విషయాలలో నేడు వాటి వాటి స్వరూపాలను మార్చుకుంటున్నాయి. ఈ మార్పులు చూసి మన మంచికి జరుగు తున్నాయని అనుకోవటంలో తప్పులేదు. అయితే గమనించాల్సింది స్వభావంలో ఏమైనా మార్పులొచ్చాయా అని చూసుకోవాలి. స్వధర్మం పేరుతో అధర్మాన్ని, స్వచ్ఛత నినాదంతో దుష్టత్వాన్ని, దేశభక్తి పేరు చెప్పి ద్వేషాన్ని రగిలిస్తున్న తరుణంలో, ఏకత పేరుతో ఐక్యమత్యాన్ని విధ్వంసమొనరుస్తున్న సందర్భంలో, న్యాయమందక ఎందరో గొంతులెత్తుతున్న వేళ న్యాయదేవత కళ్లు తెరిచి న్యాయం చేస్తుందని భావించగలమా!

ఇటీవల సుప్రీంకోర్టు ఆవరణలోని న్యాయమూర్తుల గ్రంథాలయంలో కొత్త న్యాయదేవతా విగ్రహం ఏర్పాటు చేయటంతో దేశంలో ఈ మార్పు వెనకాలవున్న ఉద్దేశాలపైన పెద్ద చర్చ మొదలయింది. సాధారణంగా న్యాయదేవత ఒక గౌను వేసుకొని, తల విరబోసుకుని, కళ్లకు గంతలతో, ఒక చేతిలో త్రాసు, మరో చేతిలో ఖడ్గంతో ఉంటుంది. న్యాయదేవతగా ప్రపంచ దేశాలలో సైతం ఈ విగ్రహం ప్రసిద్ధి. గ్రీకు పురాణాల ప్రకారం థెమిస్ అనేది న్యాయ దేవతగా చెప్పుకుంటారు. ఆమె న్యాయానికి, చట్టానికి అధికారానికీ ప్రతీక. థెమిస్‌ను గ్రీకు ప్రజలు బాగా గౌరవిస్తారు. థెమిస్ అంటే గ్రీకు భాషలో సంప్రదాయం, చట్టం అని అర్థం. ఈజిప్టులోనూ 'మాట్' దేవతను సత్యదేవతగా పూజిస్తారు. రోమ్‌లో జెస్టిసియా దేవత న్యాయానికి గుర్తుగా ఉంది. ప్రపంచ దేశాలలో ఈ విగ్రహాన్ని న్యాయ స్థానాలలో వాడుతున్నారు. బ్రిటన్, ఫ్రాన్స్ మొదలైన దేశాలలో కూడా ఈ ప్రతిమనే న్యాయానికి ప్రతీకగా పెడతారు. బ్రిటీషర్స్ నుండి మనమూ కొనసాగిస్తున్నాము. చట్టానికి అందరూ సమానమని, వారి వారి రంగు, మతము, పేద, ధనిక, ప్రాంత భేదాలు లేకుండా తప్పొప్పుల ఆధారంగానే న్యాయం జరుగుతుందని, శిక్షలు విధించడం చేస్తామని చేప్పే ప్రకటనకు, కళ్లకు గంతలు ఉంటాయని వివరిస్తారు. అలాగే ఖడ్గం ధరించడం అనేది శిక్ష విధింపునకు ఉండే అధికారాన్ని సూచిస్తుంది. ఇంకా వివరణలేవో చెపుతుంటారు.

ఇంతకాలం కోర్టుల్లోనూ న్యాయం జరగనపుడు న్యాయదేవత కళ్లు తెరచి చూడదని, అందుకనీ నిజాలు తెలువవనీ విమర్శ వచ్చేది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఆదేశాల మేరకు న్యాయ దేవత రూపురేఖలను మార్చి తయారు చేశారు. ఆ విగ్రహం కళ్లకు గంతలు తీసివేశారు. చేతిలో కత్తి బదులు రాజ్యాంగాన్ని పెట్టారు. త్రాసు అలాగే ఉంది. కానీ మొత్తం దేవతా రూపం భారతీకరించారు. "న్యాయదేవత కళ్లకు గంతలు అవసరం లేదు. చట్టం ఎప్పుడూ గుడ్డిది కాదు. అది అందరినీ సమంగా చూస్తుంది. కత్తి హింసకు ప్రతీకగా కనిపిస్తుంది. కానీ న్యాయస్థానాలు రాజ్యాంగ చట్టాల మేరకు న్యాయాన్ని అందజేస్తాయి" అని జస్టిస్ చంద్రచూడ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. వాస్తవికతలో అలా జరిగితే సంతోషమే. ఈ న్యాయ వ్యవస్థలోనే మొన్న మరణించిన ప్రొఫెసర్ సాయిబాబా తొమ్మిదేళ్లు విచారణ పేరుతో ఏ నేరం రుజువు కాకుండానే జైల్లో మగ్గారు. హక్కుల కార్యకర్త స్టాన్‌స్వామి జైల్లోనే ప్రాణాలు విడిచారు. సాయిబాబాకు తన తల్లి మరణిస్తే, చూసేందుకు కూడా అనుమతి దొరకలేదు. కానీ అనేక దుర్మార్గాలు, హత్యలు, లైంగిక దాడుల ఆరోపణలతో జైలుకెళ్లిన డేరా బాబాకు పదులసార్లు పెరోల్ దొరికిన సందర్భంలో, న్యాయదేవత విగ్రహం మారగానే న్యాయం జరుగుతుందని నమ్మటానికి అవకాశముందా?

అంబేద్కర్ ఆధ్వర్యంలో నిర్మితమైన రాజ్యాంగంపైన ఏ మాత్రమూ గౌరవం, విశ్వాసం లేని పాలకులు, అనేక రాజ్యాంగ సవరణలకు పూనుకుని, రాజ్యాంగ మౌలిక స్వభావాన్నే మార్చివేస్తున్న వేళ, న్యాయదేవత చేతిలో రాజ్యాంగాన్ని పెట్టగానే భ్రమకు గురవుతామా! కళ్లకు గంతలు తీసిన దేవతకు నిజాల్ని చూసి తీర్పులిచ్చే ధైర్యం వస్తుందా! ఈ అసమ సమాజంలో న్యాయం ఎవరి పక్షం వహించాలో న్యాయ వ్యవస్థకు ముందుగానే తెలుసు. న్యాయ చట్టాలను మార్చి, సంస్కృత పేర్లతో వాటిని పిలిచినపుడే ఏదో మార్పుకు మార్గం వేస్తున్నారని సంకేతించారు. ఇప్పుడు భారతీకరించిన మను ధర్మాన్నే న్యాయంగా తెచ్చేందుకు పూనుకునే ప్రమాదం ఉంది. అప్రమత్తంగా వేచిచూడాలి!

– ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

జనవాక్యం

కాలుష్య కోరల్లో 'యమున'

ఒకప్పుడు యయునా నదీ జలాలు స్వచ్ఛంగా వుండేవి. ఇప్పుడు యమునా జలాలంటే కాలుష్యానికి ఆలవాలం. జనాభా పెరగడం, స్వాతంత్ర్యానంతరం నదీ తీరాన పారిశ్రామికీకరణ విపరీతంగా జరగడంతో నది కాలుష్యం కాలక్రమేణా పెరుగుతూ వచ్చింది. మానవ, పారిశ్రామిక వ్యర్థాలన్నీ నదిలోకి చేరి కాలుష్యానికి యమునా నది కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీ సమీపంలో యమునా నది మురుగు కాల్వను తలపిస్తుంటుంది. పారిశ్రామిక వ్యర్థాల కారణంగా నది నురగలు తేలుతూ దర్శనమిస్తోంది. ఢిల్లీ సమీపంలో ప్రవహించే ఈ నది నీటిని నేరుగా తాగడం, పంటలకు వాడటం ప్రమాదకరమని నిపుణుల పరిశీలనలో తేలింది. ఈ నీళ్లు తాగడానికి కాదు గదా కనీసం స్నానానికి కూడా పనికి రావని, మానవ వ్యర్థాలు సాధారణ స్థితి కంటే 500 రెట్లు అధికంగా ఉన్నాయని ఢిల్లీ పొల్యూషన్ కంట్రోల్ కమిటీ ప్రభుత్వానికి నివేదికలో తెలియజేసినప్పటకీ వీటిని కాలుష్య కారకాల బారిన పడకుండా రక్షించడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. ఢిల్లీ నగరానికి అవసరమైన తాగునీటిలో సగం వాటాను అందించే యమునా నది, దేశంలోనే అత్యంత కాలుష్యపూరిత నదుల్లో ముందు వరసలో ఉంది. ఈ కాలుష్యంలో 70 నుంచి 80 శాతం ఢిల్లీ సమీపంలో ఈ నది ప్రవహించే 22 కిలోమీటర్ల పరిధిలోనే చేరుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. యమునా నదీ జలాలను శుద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా 'యమునా యాక్షన్ ప్లాన్' పేరుతో 1992 నుంచి ప్రణాళికలు రూపొందించినా కాలుష్యంలో ఫలితం కనిపించడం లేదు. దేశ రాజధాని ప్రజల నీటి అవసరాలను, ఆరోగ్యాన్ని, అలాగే పర్యాటక ప్రాభవాన్ని దృష్టిలో ఉంచుకుని యమునా నది ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– అప్పన్న గొనప,
విశాఖపట్నం.

ప్రైవేటు టెలికం కంపెనీల
దోపిడీని ప్రశ్నించరేం?

- ఏకపక్షంగా టారిఫ్‌లు పెంచేస్తున్నాయి
- ఏటా లక్ష కోట్ల లాభాలు దండుకుంటున్నాయి
- ఎలన్ మస్క్‌కు అనుకూలంగా స్పెక్ట్రమ్ కేటాయింపు విధానం
- ట్రాయ్‌కి కేంద్ర మాజీ కార్యదర్శి శర్మ బహిరంగ లేఖ



న్యూఢిల్లీ : ప్రైవేటు టెలికం కంపెనీలు ఏకపక్షంగా టారిఫ్‌ను పెంచుతున్నప్పటికీ టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఎందుకు మౌనం వహిస్తోందని భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్ శర్మ నిలదీశారు. దీనిపై టెలికం శాఖ కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ మేరకు ఆయన ట్రాయ్ ఛైర్మన్ ఎకె లహోటికి ఓ బహిరంగ లేఖ రాశారు. రెండు ప్రముఖ టెలికం కంపెనీలు టారిఫ్‌లను పెంచాయంటూ తాను జూలై 10వ తేదీన కూడా ట్రాయ్, టెలికం శాఖ దృష్టికి తీసుకెళ్లానని ఆయన అందులో గుర్తు చేశారు. ప్రైవేటు టెలికం కంపెనీలు నిస్సహాయులైన లక్షలాది మంది వినియోగదారుల నుండి టారిఫ్‌ల రూపంలో వేల కోట్ల రూపాయలు దండుకుంటున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమెరికాకు చెందిన వ్యాపారవేత్త ఎలన్ మస్క్‌కు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం స్పెక్ట్రమ్ కేటాయింపు విధానాన్ని మార్చేసిందని ఈ నెల 22న రాసిన లేఖలో శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. '2జి స్పెక్ట్రమ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోకుండా ఎలన్ మస్క్ డిమాండుకు సంబంధిత కేంద్ర మంత్రి అంగీకారం తెలిపారు. ఉపగ్రహ స్పెక్ట్రమ్‌ను పాలనా సంబంధమైన కేటాయింపులు జరపాలని మస్క్ డిమాండ్ చేశారు' అని తెలిపారు. డిజిటల్ మౌలిక సదుపాయాలను మరింత పెంచేందుకు వీలుగా మరోసారి టారిఫ్ పెంపుదలకు అనుమతించాలంటూ ఎయిర్‌టెల్ అధినేత సునీల్ భారతి మిట్టల్ ఇటీవల చేసిన ప్రకటనను శర్మ ప్రస్తావించారు. ట్రాయ్, టెలికం శాఖ ఏవైనా అక్రమాలు పాల్పడి ఉంటే వాటిని బయటికి తీసేందుకు స్వతంత్ర విచారణకు ఆదేశించాలని తాను కాబినెట్ కార్యదర్శికి లేఖ రాశానని శర్మ తెలిపారు. ఒకవేళ అక్రమాలు జరిగి ఉంటే వాటిపై పార్లమెంట్, ప్రజలు చర్చించే అవకాశం లభిస్తుందని అన్నారు. ఏటా లక్ష కోట్ల రూపాయల అదనపు లాభాలు ఆర్జించడానికి టెలికం కంపెనీలు ఏకపక్షంగా టారిఫ్‌లు పెంచితే దానిపై ట్రాయ్ గళం విప్పాల్సిన అవసరం లేదా? అని శర్మ తన లేఖలో ప్రశ్నించారు.

ఉచిత ఇసుక అందించడమే లక్ష్యం : పార్థసారధి

ప్రజాశక్తి - ముసునూరు (ఏలూరు జిల్లా)

ప్రజలకు పారదర్శకంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉచిత ఇసుక సరఫరాకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలంలోని తమ్మిలేరు పరివాహక ప్రాంతమైన వలసపల్లి, ఎల్లాపురం గ్రామాల్లో ఉచిత ఇసుక రీచ్‌లను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలకులు ఐదేళ్లు పాటు ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వేశారని, అంతటితో ఆగకుండా ఇసుక ధరలు పెంచి ప్రజలు, నిర్మాణదారులపై ఆర్థిక భారం మోపారన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇసుక కొనుగోలు భారం కాకూడదని, నిర్మాణ రంగానికి ఊతం ఇవ్వాలన్న ఉద్దేశంతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రాగానే ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చామన్నారు. అధిక వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో నదులన్నీ జలకళతో నిండిపోవడం వల్ల, దాంతో ఇసుక తీయడానికి ఆటంకాలు ఏర్పడి, కొంత అందుబాటులోకి రాలేదన్నారు. ఇటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఇప్పుడున్న రీచ్‌లతో పాటు రాష్ట్రంలో మరో 108 కొత్త రీచ్‌లకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. తద్వారా ఇసుక సరఫరా పెంచడానికి అవకాశం ఉంటుందన్నారు. ఉచిత ఇసుక విధానంలో ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. సీనరేజ్, డిఎంఎఫ్. మెరిట్ ఫీజులకు మినహాయింపు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆ నష్టం భరిస్తూ, ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీనివల్ల టన్నుకు రూ.88 చెల్లించాల్సి ఉండేదని, దీన్ని రద్దు చేయడం వల్ల రూ.265 కోట్లు ప్రభుత్వంపై భారమైనప్పటికీ రద్దు చేయడం జరిగిందన్నారు. ప్రజలు తమ గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుకను సొంతంగా లోడింగ్ కోసం లేబరు, ట్రాక్టర్లు వినియోగించుకొని ఇసుక తీసుకెళ్లేందుకు ప్రభుత్వానికి అభ్యంతరం లేదన్నారు.

ఐద్వా తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా
అరుణజ్యోతి, మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా అరుణజ్యోతి, మల్లు లక్ష్మి తిరిగి ఎన్నికయ్యారు. ఖమ్మం జిల్లాకు చెందిన మాచర్ల భారతిని కోశాధికారిగా ఎన్నుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర మహాసభ విజయవంతంగా ముగిసింది. ఐద్వా అఖిలభారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పికె శ్రీమతి, మరియం ధావలే, ఎస్ పుణ్యవతి సమక్షంలో 71 మందితో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిలో 19 మందికి రాష్ట్ర కార్యదర్శివర్గంలో చోటు కల్పించారు. మరో ఇద్దరికి తర్వాత చోటు కల్పిస్తారు.

ఐద్వా రాష్ట్ర ఆఫీస్‌బేరర్స్...

అధ్యక్షురాలిగా అరుణజ్యోతి, కార్యదర్శిగా మల్లు లక్ష్మి,



కోశాధికారిగా మాచర్ల భారతి, ఉపాధ్యక్షులుగా టి జ్యోతి, ఎన్.రత్నమాల, శశికళ, మందడపు జ్యోతి, పాలడుగు ప్రభావతి, వై వరలక్ష్మి, మద్దెల వినోద, ఎ మహేశ్వరి, ఎ శారద, సహాయ కార్యదర్శులుగా కెఎన్ ఆశాలత, బుగ్గవీటి సరళ, నాగలక్ష్మి, బండి పద్మ, బట్లుపల్లి అనురాధ, ఎండీ షబానా, గీతారాణి ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షురాలిగా సీనియర్ నాయకురాలు బత్తుల హైమావతి ఎన్నికయ్యారు. మరో ఇద్దరు ఆఫీస్ బేరర్లను తర్వాత ఎన్నుకుంటారు. వీరితో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులుగా 51 మందిని ఎన్నుకున్నారు.

తగ్గిన ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లాభాలు

బెంగళూరు : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ నికర లాభాలు 23 శాతం తగ్గి రూ.233 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.328 కోట్ల లాభాలు సాదించింది. గడిచిన క్యూ2లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 9.5 వాతం పెరిగి రూ.944 కోట్లుగా చోటు చేసుకుంది. బ్యాంక్ స్థూల రుణ పుస్తకం 14 శాతం పెరిగి రూ.30,344 కోట్లకు చేరింది. స్థూల నిరర్థకా స్తులు 2.5 శాతంగా, నికర ఎన్‌పిఎలు 0.6 శాతంగా నమోదయ్యాయి. గడిచిన త్రైమాసికంలో మొండి బాకీలకు చెందిన రూ.140 కోట్ల రుణాలను రద్దు చేసింది.

స్విగ్గీ ప్లాట్‌ఫామ్ ధర పెంచేసింది..

న్యూఢిల్లీ : జొమాటో బాటలోనే స్విగ్గీ కూడా తన ప్లాట్‌ఫామ్ ధరను పెంచింది. ప్రతి ఆర్డర్‌పైనా రూ.10 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించింది. ఇంతక్రితం ఇది రూ.7గా ఉంది. పెంచిన ధరలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయని స్పష్టం అవుతోంది. హైదరాబాద్‌లోని ఆర్డర్లపై రూ.10కి పెంచినట్లు బిల్లింగ్‌లో చేర్చేంది.

డాబర్ మెస్వాక్‌కు ప్రచారకర్తగా నాగార్జున

హైదరాబాద్ : సైన్స్ ఆధారిత అయుర్వేద కంపెనీ డాబర్ ఇండియా తన డాబర్ మెస్వాక్ టూత్‌పేస్ట్ బ్రాండ్ అంబాసీడర్‌గా హీరో నాగర్జున అక్కినేనిని నియమించుకున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. ఈ టూత్‌పేస్ట్‌తో 70 పైగా లాభాలు ఉన్నాయని పేర్కొంది. నాగార్జునతో ప్రచారం దక్షిణాదిలో తమ బ్రాండ్‌ను బలోపేతం చేసుకోవడానికి దోహదం చేయనుందని డాబర్ ఇండియా ప్రతినిధి అభిషేక్ జుగ్రన్ పేర్కొన్నారు.

భారత మార్కెట్లోకి బిస్‌సెల్ బ్రాండ్

న్యూఢిల్లీ : ఫ్లోర్‌కేర్ ఉత్పత్తుల అంతర్జాతీయ దిగ్గజం బిస్‌సెల్ భారత మార్కెట్లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. అమెరికాకు చెందిన ఈ కంపెనీ 148 ఏళ్లుగా క్లీనింగ్ సొల్యూషన్స్‌లో ఉంది. భారత్‌లో సమగ్ర పంపిణీ, సపోర్టు సేవలను అందించడానికి బిస్‌సెల్‌తో తాము భాగస్వామ్యం కుదర్చుకున్నట్లు ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ కవిటాక్ తెలిపింది.

గాండేయ్ స్థానానికి కల్పనా సోరెన్ నామినేషన్

రాంచీ : జార్ఖండ్ ముక్తిమోర్చా నాయకురాలు, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్ గాండేయ్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆమె వెంట పలువురు పార్టీ నేతలు ఉన్నారు. మనీలాండరింగ్ కేసులో తన భర్త, సిఎం హేమంత్ సోరెన్ అరెస్ట్‌తో ఈ ఏడాది మార్చిలో కల్పనా సోరెన్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత మే నెలలో జరిగిన ఉప ఎన్నికల్లో గాండేయ్ స్థానం నుంచి గెలుపొంది తొలిసారి అసెంబ్లీకి వెళ్లారు. గాండేయ్ ఎమ్మెల్యే (జెఎంఎం) సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి దిలీప్ కుమార్ వర్మపై ఆమె 27 వేల ఆధిక్యంతో గెలుపొందారు. ఇప్పుడు అదే స్థానం నుంచి పోటీకి దిగారు.

'ఏక్ పోలీస్' విధానం అమలు చేయండి

- తెలంగాణాలో రోడ్డెక్కిన పోలీసుల కుటుంబీకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో పోలీసుల భార్యలు రోడ్డెక్కారు. తమ భర్తలతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆరోపిస్తూ నిజామాబాద్, మంచిర్యాల, సిరిసిల్ల జిల్లాల్లో గురువారం ఆందోళనలు చేశారు. శాంతి భద్రతల కోసం రిజర్వుడు పోలీసులు వెట్టి చాకిరీ చేస్తున్నా, వారి కుటుంబాలను ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వాపోయారు. 'ఏక్ స్టేట్-ఏక్ పోలీస్' విధానం ఏర్పాటు చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్ గేటు వద్ద 7వ బెటాలియన్‌కు చెందిన పోలీసుల కుటుంబీకులు నిరసన తెలిపారు. ఇదే సమయంలో ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తున్న కెటిఆర్.. పోలీసు కుటుంబ సభ్యులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకొని వారితో మాట్లాడారు. బెటాలియన్ పోలీసుల సమస్యలపై తాను అసెంబ్లీలో మాట్లాడతానని హామీ ఇచ్చారు. మంచిర్యాల జిల్లా గుడిపేట్ 13వ బెటాలియన్ ఎదుట పోలీసుల భార్యలు పిల్లలతో కలిసి ధర్నాకు దిగారు. టిజిఎస్‌పి డౌన్ డౌన్, ఏక్ పోలీస్ వ్యవస్థ అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. తమ భర్తలను పోలీస్ విధులు కాకుండా రోజుల తరబడి ఇతర ప్రాంతాల్లో విధులు కేటాయించడంతో కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తోందన్నారు. ఉదయం 5 గంటలకే రోల్ కాల్ ఇవ్వడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. బెటాలియన్ కమాండెంట్ రాములు ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సిరిసిల్లలోని 17వ బెటాలియన్ వద్ద పోలీసుల భార్యలు ఆందోళన చేశారు. తమ భర్తలను రక్షక భటులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల డిఎస్‌పి చంద్రశేఖర్ రెడ్డి నచ్చజెప్పినా వినకపోవడంతో ధర్నా చేస్తున్న మహిళలను అదుపులోకి తీసుకొని 17వ బెటాలియన్‌కు తరలించారు.


నిజామాబాద్‌లో రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న పోలీసుల భార్యలు

బెంగాల్, హర్యానా గెలుపు



హైదరాబాద్: ప్రొ కబడ్డీ సీజన్-11లో భాగంగా గురువారం జరిగిన పోటీల్లో బెంగాల్ వారియర్స్, హర్యానా స్టీలర్ జట్టు గెలుపొందాయి. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో బెంగాల్ జట్టు 32-29పాయింట్ల తేడాతో యుపి యోధాను చిత్తుచేయగా.. రెండో మ్యాచ్‌లో హర్యానా జట్టు 37-25పాయింట్ల తేడాతో జైపూర్ పింక్ ప్యాంథర్స్‌ను చిత్తుచేసింది.

తొలిటెస్ట్‌లో దక్షిణాఫ్రికా విజయం

బంగ్లాదేశ్‌పై ఏడు వికెట్ల తేడాతో గెలుపు



ఢాకా: బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో దక్షిణాఫ్రికా జట్టు ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో సుదీర్ఘ ఫార్మాట్‌లో 10ఏళ్ల తర్వాత తొలి విజయం సాధించింది. మిర్పూర్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన ఈ టెస్ట్‌లో కగిసో రబడ(3/26, 6/36), కేశవ్ మహరాజ్(3/34, 3/105) సఫారీల గెలుపులో కీలకపాత్ర పోషించారు. అనంతరం బంగ్లా నిర్దేశించిన 105 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా జట్టు 3వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో ఎడెన్ మర్కరమ్ సేన రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 106 పరుగులకే కుప్పకూలిన ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 307పరుగులు చేసింది. ఆల్‌రౌండర్ మెహిదీ హసన్ మిరాజ్(97) తృటిలో సెంచరీ మిస్ చేసుకోగా... జకీర్ అలీ(58) అర్ధసెంచరీతో రాణించాడు. దీంతో బంగ్లా రెండో ఇన్నింగ్స్‌లో 307 పరుగులకు ఆలౌటయ్యింది. ఆ తర్వాత దక్షిణాఫ్రికా ఓపెనర్లు టోనీ జోర్జి(40), ఎడెన్ మర్కరమ్(20)లు శుభారంభం ఇచ్చారు. ట్రిస్టన్ స్టబ్స్(30 నాటౌట్), డెవిడ్ బడంగ్‌హమ్(12)లు సమయోచితంగా ఆడి జట్టును విజయ తీరాలకు చేర్చారు. కైలి వెరెనేకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

ప్రజల దృష్టిని మరల్చేందుకే 'ఉక్కు' ప్యాకేజీ ప్రకటనలు : సిఐటియు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎన్.రామారావు

కార్మికులు, ప్రజల సహకారంతో ఉక్కు పరిరక్షణ ఉద్యమం విజయవంతంగా సాగుతోందని, ప్రజల సహకారాన్ని ఆ ఉద్యమానికి దూరం చేయడం కోసమే విశాఖ ఉక్కు కర్మాగారానికి ప్యాకేజీలు ఇస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తోందని సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1351వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు, కార్యకర్తలు, కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజల దృష్టిని మరల్చి స్టీల్ ప్లాంట్‌ను తన తాబేదారులకు కట్టబెట్టాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రజలకు ఉక్కు కర్మాగారంపై వాస్తవాలను వివరించి రానున్న కాలంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ నెల 28న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ యాజమాన్యం కార్మికుల్లో గందరగోళాన్ని సృష్టిస్తూ విఆర్‌ఎస్ పేరుతో చేస్తోన్న ప్రచారాన్ని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికుల ప్రయోజనాలకు గండి కొడుతూ యాజమాన్యం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. వేతనాలను సకాలంలో చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందు లు సృష్టిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.గంగాధర్, మొహి ద్దిన్, డిఎస్‌విఎస్.శ్రీనివాస్, కె.బాలశౌరి, కెఆర్‌కె.రాజు, వి.మురళి, రామచంద్ర మూర్తి, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

- మంత్రి రామ్‌ప్రసాద్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత మూడు శాఖల సంయుక్త కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ తెలిపారు. రవాణా, వైద్యారోగ్య, హోంశాఖలు రూపొందించే ఈ కార్యాచరణలో భాగంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో ఎపి, టిఎస్ బస్ ఆపరేటర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రవాణా శాఖ సాఫ్ట్‌వేర్‌లో ఉన్న ఇబ్బందులను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బస్సుల యజమానులు తమవంతు కృషి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదం కారణంగా తాను చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రవాణాకు సంబంధించి అమలులో ఉన్న పన్నులను తగ్గించే విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అధికారుల నుంచి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. బస్సు యజమానుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విధి విధానాలకు అనుగుణంగా బస్సులు నడుపుతూ ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. తెలంగాణ శాఖ అధ్యక్షులు సునీల్ రెడ్డి మాట్లాడుతూ.. 2+1 స్లీపర్ బస్సులను రిజిస్ట్రేషన్ చేసి ఆల్ ఇండియా పర్మిట్‌కు అవకాశం కల్పించిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

కేసు కొట్టేయండి

- సాక్షి ఎడిటర్

ప్రజాశక్తి-అమరావతి

విజయవాడ వరద సహాయంపై తప్పుడు కథనాన్ని ప్రచురించారంటూ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ సాక్షి పత్రిక ఎడిటర్ వర్ధిల్లి మురళి గురువారం రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విజయవాడ పటమట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బివిఎల్‌ఎన్ చక్రవర్తి విచారణ జరిపారు. పిటిషనర్ విషయంలో పోలీసులు బిఎన్‌ఎస్‌ఎస్ చట్టంలోని సెక్షన్ 35(3) నిబంధనలను (సిఆర్‌పిసి సెక్షన్ 41ఏ)ను అమలు చేయాలని ఆదేశించారు.

మారుతున్న ప్రపంచ వ్యవస్థకు బ్రిక్స్ ఒక ఉదాహరణ

- సదస్సులో జై శంకర్
- స్థిరీకరణ శక్తిగా బ్రిక్స్ ఎదగాలన్న జిన్‌పింగ్
- రెండు దేశాల ఏర్పాటే పరిష్కారం : పుతిన్



సదస్సులో పాల్గొన్న విదేశాంగ మంత్రి జై శంకర్

కజన్ : ప్రపంచ వ్యవస్థ ఎంతలా మారుతుందో చెప్పడానికి బ్రిక్స్ ఒక ఉదాహరణ అని విదేశాంగ మంత్రి జై శంకర్ వ్యాఖ్యానించారు. 16వ బ్రిక్స్ సదస్సులో ఆయన ప్రసంగిస్తూ, వలస పాలన నుండి విముక్తి పొందిన దేశాలు శీఘ్రగతిన అభివృద్ధి సాధించడంలో, సామాజిక ఆర్థిక ప్రగతిని నెలకొల్పడంలో ఎంతలా విజయాలు సాధించాయో, పాత ప్రపంచ క్రమం ఎలా మారుతుందో తెలుసుకునేందుకు బ్రిక్స్ ఒక ప్రతీకగా ఉందన్నారు. కొత్త సామర్ధ్యాలు ఆవిర్భవించాయని, మరింత ప్రతిభ, నైపుణ్యాలను వినియోగించుకునే వెసులుబాటు కలిగిందని అన్నారు. ఈ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పున్హసమతుల్యత కారణంగా వాస్తవమైన బహుళధ్రువ ప్రపంచం గురించి మనం యోచించగలుగుతున్నామని అన్నారు. మరింత సమతూకంతో కూడిన ప్రపంచ వ్యవస్థను సృష్టించాలంటే స్వతంత్ర వేదికలను బలోపేతం చేస్తూ, విస్తరించడం కీలకమని అన్నారు. అక్కడ నుండే బ్రిక్స్ ఉద్భవించిందన్నారు.

స్థిరీకరణ శక్తిగా బ్రిక్స్

ప్రపంచం చాలా తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోందని, ఈ పరిస్థితుల్లో స్థిరీకరణ శక్తిగా బ్రిక్స్ వ్యవహరించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బ్రిక్స్ నేతలను కోరారు. ఆధునికత దిశగా ప్రపంచ పేద దేశాలు ఉమ్మడిగా అడుగు వేయడమనేది ప్రపంచ చరిత్రలోనే చాలా పెద్ద సంఘటన అని వ్యాఖ్యానించారు. శాంతి స్థాపన కోసం మనం ఒక సుస్థిర శక్తిగా వ్యవహరించాలి, అంతర్జాతీయ భద్రతా పాలనను బలోపేతం చేయాలి, సమస్యలకు మూల కారణాలను అన్వేషించి, పరిష్కారాలను కనుగొనాలని పేర్కొన్నారు. శాంతియుత అభివృద్ధికి సంబంధించి తీవ్ర సవాళ్లు ఎదురవుతున్నాయని హెచ్చరించారు.

తక్షణమే కాల్పుల విరమణ : జిన్‌పింగ్

గాజాలో కాల్పుల విరమణ జరగాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. లెబనాన్‌లో పరిస్థితులు మరింత పెచ్చరిల్లకుండా చూడాల్సి వుందన్నారు. పాలస్తీనా, లెబనాన్‌ల్లో రక్తపాతం, విధ్వంసం వుండరాదని అన్నారు. .

రెండు దేశాల ఏర్పాటుతోనే చారిత్రక అన్యాయం సరిదిద్దగలుగుతాం : పుతిన్

ఏడాది క్రితం గాజాలో మొదలైన సైనిక దాడులు ఇప్పుడు లెబనాన్‌కు విస్తరించాయని, వీటివల్ల ఆ ప్రాంతంలోని ఇతర దేశాలు కూడా ఇబ్బందులు పడుతున్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య ఘర్షణల స్థాయి రాన్రాను పెరుగుతోందని హెచ్చరించారు. గొలుసు కట్టుగా జరిగే ఈ పరిణామాలు మొత్తంగా మధ్య ప్రాచ్యాన్ని పూర్తిస్థాయి యుద్ధం వైపునకు నెట్టేస్తున్నాయని వ్యాఖ్యానించారు. స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడేవరకు మధ్య ప్రాచ్యంలో హింస తప్పదని అన్నారు. "పాలస్తీనా భూభాగాల్లో శాంతి, సుస్థిరతల పునరుద్ధరణ జరగాలంటే ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి, జనరల్ అసెంబ్లీ ఆమోదించిన రెండు దేశాల పరిష్కారాన్ని అమలు చేయడమొక్కటే మార్గం." అని స్పష్టం చేశారు. దీనివల్ల పాలస్తీనా ప్రజలకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దడానికి వీలవుతుందని వ్యాఖ్యానించారు. కీలకమైన ఈ డిమాండ్ పరిష్కారం కానంతవరకు విషపూరితమైన ఈ హింసా చక్రాన్ని విచ్ఛిన్నం చేయడం సాధ్యం కాదని అన్నారు.

ఆ జర్నలిస్టుపై ఎలాంటి చర్యలూ వద్దు

- యుపి సర్కార్‌ను ఆదేశించిన సుప్రీం

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లో నాలుగు ఎఫ్‌ఐఆర్‌లు నమోదైన జర్నలిస్టులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదంటూ సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. తనపై దాఖలైన ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేయాలంటూ జర్నలిస్టు మమతా త్రిపాఠి సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై స్పందన తెలియజేయాల్సిందిగా జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ పి.కె.మిశ్రా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ యుపి ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. ఆ ఎఫ్‌ఐఆర్‌లన్నీ రాజకీయ దురుద్దేశంతో నమోదైనవేనని, పత్రికా స్వేచ్ఛను హరించే ప్రయత్నంలో బూటకంగా దాఖలు చేసినవేనని మమతా త్రిపాఠి పేర్కొన్నారు. తాను చేసిన కొన్ని ట్వీట్లకు సంబంధించే ఈ ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసు విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు. ఈలోగా ఆమెపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని కోర్టు ఆదేశించింది. అయోధ్య, అమేథీ, బారాబంకి, లక్నోల్లో ఆ నాలుగు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. వాస్తవాలను పేర్కొంటూ రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనల గురించి చెప్పడానికి పిటిషనర్ తన కథనాల ద్వారా ప్రయత్నించానని అది పాలక వర్గానికి నచ్చలేదని, అందుకే అవి బూటకపు ఎఫ్‌ఐఆర్‌లని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

తోషఖానా అవినీతి కేసులో ఇమ్రాన్ భార్యకు బెయిల్

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సతీమణి బుష్రా బీబీ గురువారం బెయిల్‌పై విడుదలయ్యారు. తోషఖానా అవినీతి కేసులో అరెస్టయిన ఆమె దాదాపు 9 మాసాల పాటు జైల్లో వున్నారు. 10లక్షల పికెఆర్ ష్యూరిటీ బాండ్‌పై ఇస్లామాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మియాంగల్ హసన్ ఔరంగజేబ్ ఆమెకు బుధవారం బెయిల్ మంజూరు చేశారు. బుష్రా విడుదలను పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ ధ్రువీకరించింది. విదేశీ ప్రతినిధుల నుండి పాకిస్తాన్ ప్రభుత్వానికి అందిన బహుమతులను విక్రయించి ఆ మొత్తాలను తీసుకున్నారంటూ ఖాన్ దంపతులపై ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో ఇంకా ఆమెను విచారించాల్సిన అవసరం వుందా అంటూ దర్యాప్తు అధికారిని జస్టిస్ ఔరంగజేబ్ ప్రశ్నించారు. ఆమెను అదనగా విచారించాల్సిన అవసరం లేదని చెప్పడంతో బెయిల్ మంజూరు చేశారు. ఈ కేసులో తన భార్యకు సంబంధం ఏమీ లేదని ఇమ్రాన్ ఖాన్ పదే పదే పేర్కొంటున్న నేపథ్యంలో బుష్రా విడుదల ఆయనకు, పార్టీకి ఉపశమనం కలిగించింది.

జస్టిస్ సంజీవ్ ఖన్నా నేపథ్యం

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు 51వ ప్రధానన్యాయమూర్తిగా నియమితులయైన జస్టిస్ సంజీవ్ ఖన్నా 1960 మే 14న జన్మించారు. 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేయించుకున్నారు. తొలుత ఆయన ఢిల్లీలోని తీస్‌హజారీ జిల్లా కోర్టులోనూ, ఆ తర్వాత ఢిల్లీ హైకోర్టులోను, ట్రిబ్యునళ్లలోనూ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. రాజ్యాంగ చట్టాలు, ఆదాయ పన్ను, ప్రత్యక్ష పన్నులు, ఆర్బిట్రేషన్, కమర్షియల్ చట్టాలు, కంపెనీ చట్టాలు, భూ చట్టాలు, పర్యావరణ చట్టాలు, వైద్య నిర్లక్ష్యానికి సంబంధిన అంశాలు ఇలా విభిన్నమైన రంగాలు, విభిన్నమైన కేసుల్లో ఆయన వాదనలు వినిపించారు. ఆదాయపన్ను శాఖకు సుదీర్ఘకాలం సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. దేశ రాజధాని ప్రాంతం ఢిల్లీ (ఎన్‌సిటిడి)లో సివిల్ వ్యవహారాలకు సంబంధించి స్టాండింగ్ కౌన్సిల్‌గా 2004లో ఆయన నిమితులయ్యారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గానూ, అమికస్ క్యూరీగానూ ఆయన అనేక క్రిమినల్ కేసుల్లో సైతం ఢిల్లీ హైకోర్టులో వాదనలు వినిపించారు. 2005లో ఢిల్లీ హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ సంజీవ్ ఖన్నా..ఆ తర్వాత 2006లో అదే కోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉంటూనే ఢిల్లీ జ్యుడిషియల్ అకాడమీ ఛైర్మన్‌గాను, ఢిల్లీలోని అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కేంద్రానికి, జిల్లా కోర్టు మధ్యవర్తిత్వ కేంద్రాలకు ఇన్ ఛార్జి జడ్జీగా బాధ్యతలు నిర్వహించారు. 2019 జనవరి 18న ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2023 జూన్ 17 నుంచి 2023 డిసెంబర్ 25వరకు ఆయన సుప్రీంకోర్టు లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన నేషనల్ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గాను, భోపాల్‌లోని నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ పాలక మండలి సభ్యునిగా సేవలందిస్తున్నారు. 2025 మే 13న ఆయన పదవీ విరమణ పొందనున్నారు.

పూరి-సాగర్ ఐలండ్ మధ్య నేడు తీరం దాటనున్న దానా

(మొదటిపేజీ తరువాయి)

చేపల వేటకు వెళ్లరాదని ఆదేశాలు జారీ చేశారు. తుపాను దృష్ట్యా తూర్పు, ఆగ్నేయ రైల్వేలు పెద్ద సంఖ్యలో రైళ్లను రద్దు చేశాయి. కోల్‌కతా ఎయిర్‌పోర్టులో గురువారం సాయంత్రం ఆరు గంటల నుండి 15గంటల పాటు విమాన రాకపోకలను నిలిపివేశారు. బెంగాల్ రాజ్‌భవన్‌లో టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని పల్లపు ప్రాంతాల్లోని మూడున్నర లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. అవసరమైన సమాచారం అందించేందుకు 24గంటలు పనిచేసే హెల్ప్ లైన్ నెంబరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుపాను పరిస్థితులను ఎదుర్కొనడానికి ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సమాయత్తమయ్యారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు భారత నావికా దళం రెండు నౌకలను సిద్ధం చేసింది.

70కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు



న్యూఢిల్లీ : 70కి పైగా విమానాలకు గురువారం బాంబు బెదిరింపులు వచ్చాయి. 11 రోజుల్లో దాదాపు 250 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఎయిర్‌ఇండియా, విస్తారా, ఇండిగోకు చెందిన ఒక్కో సంస్థకు 20 విమానాల చొప్పున, ఆకాశా ఎయిర్‌కు చెందిన 14 విమానాలకు బెదిరింపులు వచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అక్టోబర్ 24న నడిచే కొన్ని విమానాలకు భద్రతా హెచ్చరికలు అందాయని ఆకాశా ఎయిర్ ప్రతినిధి తెలిపారు. ఆకాశ ఎయిర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయని, భద్రత, నియంత్రణ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామని పేర్కొన్నారు. స్థానిక అధికారుల సమన్వయంతో అన్ని భద్రతాపరమైన విధానాలను అనుసరిస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంస్థకు చెందిన 14 దేశీయ, అంతర్జాతీయ విమానాలకు భద్రతా సంబంధిత హెచ్చరికలు అందాయని ఇండిగో ధ్రువీకరించింది. ప్రయాణికులంతా సురక్షితంగా దిగారని, సంబంధిత అధికారులతో కలిసి పనిచేస్తున్నామని, ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను అనుసరిస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు.

జమ్ముకాశ్మీర్‌లో మరో ఉగ్రదాడి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. బారాముల్లా జిల్లా నాగిన్ పోస్ట్ సమీపంలోని బోటపత్రి వద్ద వాహనంపై ఉగ్రవాదులు గురువారం జరిపిన కాల్పుల్లో ఆర్మీ పోర్టర్ మరణించారు. ముగ్గురు సైనికులుసహా ఐదుగురు గాయపడ్డారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. పుల్వామా జిల్లాలోని త్రాల్ ప్రాంతంలో గురువారం జరిపిన కాల్పుల్లో ఒక కార్మికుడు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. బటాగుండ్ గ్రామంలో టెర్రరిస్టులు కాల్పులు జరపడంతో బిజ్నోర్‌కు చెందిన శుభమ్ కుమార్ చేతికి బుల్లెట్ గాయమైందని అధికారులు వెల్లడించారు. ఉగ్రవాదుల కోసం ఆర్మీ అధికారులు గాలిస్తున్నారు. ఆదివారం ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు కార్మికులు, ఒక వైద్యుడు మరణించిన సంగతి తెలిసిందే. నాలుగురోజుల్లోనే మరోసారి దాడికి పాల్పడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వారంరోజుల్లో ఉగ్రవాదులు మూడుసార్లు కాల్పులకు పాల్పడటం కలకలం రేపింది.

నస్రత్ శరణార్థి శిబిరంపై దాడి

- ఐదుగురు చిన్నారులతో సహా 17మంది మృతి
- 20వ రోజుకు చేరిన ఉత్తర గాజా దిగ్బంధనం
- ఆక్రమణలను అడ్డుకుంటాం : హమాస్
- బీరుట్‌పై వరుస దాడులు
- హిజ్బుల్లా ఆయుధ ఫ్యాక్టరీలే లక్ష్యమన్న ఇజ్రాయిల్



దాడిలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

గాజా, బీరుట్ : గాజాలోని నుస్రత్ శరణార్ధ శిబిరంపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో 11నెలల చిన్నారితో సహా 17మంది పాలస్తీనియన్లు మరణించారు. 32మంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా వుంది. నస్రత్‌లోని పాఠశాలలన్నీ వేలాదిమంది నిర్వాసితులకు ఆవాస కేంద్రాలుగా మారిపోయాయి. మహిళలు, పిల్లా పాపలతో కిక్కిరిసిపోయిన ఆ శిబిరాలను కూడా ఇజ్రాయిల్ బలగాలు వదిలిపెట్టడం లేదు. మృతుల్లో ఐదుగురు పిల్లలు, ఇద్దరు మహిళలు వున్నారు. నిర్వాసిత కుటుంబాలు తలదాచుకున్న స్కూళ్లను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ దాడులు జరపడం ఇదే మొదటిసారి కాదు. వారికి అవసరమైన చికిత్సనందించడానికి కావాల్సిన మందులు, ఇతర వైద్య సరఫరాలు కూడా సరిగా లేవు. ఈ పరిస్థితుల్లో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలు వున్నాయని ఆందోళన చెందుతున్నారు. స్థానిక మార్కెట్‌కు సమీపంలో వుండే ఈ స్కూలుపై ఒక క్షిపణి కన్నా ఎక్కువే ప్రయోగించినట్లు తెలుస్తోంది.

ఇదిలావుండగా, ఉత్తర గాజా దిగ్బంధనం 20వ రోజుకు చేరింది. జాబాలియా శరణార్థ శిబింపై జరిగిన సైనిక దాడిలో ఇప్పటివరకు 770మంది పాలస్తీనియన్లు మరణించగా, వెయ్యి మందికి పైగా గాయపడ్డారని గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం తెలిపింది. ఇప్పటివరకు గాజా మృతుల సంఖ్య 42,847కి చేరగా, గాయపడిన వారి సంఖ్య 1,00,544కి చేరింది.

జాతి నిర్మూలన ప్రణాళికను భగ్నం చేస్తాం : హమాస్

ఉత్తర గాజా నుండి పాలస్తీనియన్లను మొత్తంగా తుడిచిపెట్టాలన్న ఇజ్రాయిల్ జనరల్స్ ప్రణాళికలను భగ్నం చేస్తామని హమాస్ పేర్కొంది. పాలస్తీనియన్ల జాతిని నిర్మూలించేందుకు చేపట్టిన ఈ దాడులను, అందులో భాగంగా ఆక్రమణలను అమలు చేయాలన్న వారి పథకాలను అమలు కానివ్వబోమని స్పష్టం చేసింది. ఈ దిశగా ఇప్పటికే ఉధృతంగా రాజకీయ, దౌత్య ప్రచారాలను నాయకత్వం చేపట్టినట్లు హమాస్ ఒక ప్రకటనలో తెలిపింది. టర్కీ, కతార్, రష్యాల్లో తమ నాయకత్వం పర్యటిస్తోందని, ఈజిప్ట్, ఇరాన్ నాయకత్వంతో, ఐక్యరాజ్యసమితి ప్రతినిధులతో కూడా మాట్లాడుతున్నామని పేర్కొంది. మరోవైపు గాజా కాల్పుల విరమణ కోసం తాజా ప్రయత్నాల్లో భాగంగా అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ కతార్ అమీర్ షేక్ తమిన్ బిన్ హమద్‌తో భేటీ అయ్యారు.

బీరుట్ శివార్లలో 17కి పైగా వరుస దాడులు

మరోవైపు బీరుట్‌లోని దక్షిణ శివార్లలో బుధవారం రాత్రంతా 17కి పైగా వరుస దాడులు జరిగాయి. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా ప్రారంభమైన ఈ దాడుల్లో ఆరు భవనాలు నేలమట్టమయ్యాయి. ఒకరు మరణించారని, ఐదుగురు గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య శాఖ వెల్లడించింది. హిజ్బుల్లాకు గట్టి పట్టు వున్న దక్షిణ బీరుట్‌లో పలు ఆయుధ ఫ్యాక్టరీలపై దాడులు చేసినట్లు ఇజ్రాయిల్ మిలటరీ గురువారం వెల్లడించింది. నిఘా వర్గాల సమాచారం మేరకే తాము ఆయుధ నిల్వల కేంద్రాలు, తయారీ కేంద్రాలపై దాడి చేశామని తెలిపింది.

లెబనాన్‌కు ఫ్రాన్స్ సాయం

లెబనాన్‌కు మద్దతుగా 10.8కోట్ల డాలర్ల సహాయ ప్యాకేజీని అందిస్తామని ఫ్రాన్స్ హామీ ఇచ్చింది. దాడుల కారణంగా అక్కడ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని, తక్షణావసరంగా ప్రజలకు పెద్ద ఎత్తున సాయమందించాల్సి వుందని ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ తెలిపారు. పారిస్‌లో గురువారం లెబనాన్‌పై అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఆ సదస్సులో మాక్రాన్ సాయంపై ప్రకటన చేశారు. ఇప్పటికే ఇటలీ, జర్మనీలు సాయాన్ని ప్రకటించాయి. లెబనాన్ సార్వభౌమాధికారాన్ని పునరుద్ధరించి, సంస్థలను మరింత బలోపేతానికి సాయపడాల్సిందిగా మాక్రాన్ కోరారు.

ఓస్వాల్ సైబర్ ఫ్రాడ్ కేసులో 15 మంది అరెస్ట్

- రూ.4 కోట్లు రికవరీ

న్యూఢిల్లీ : స్కామర్ల చేతిలో మోసపోయి, వారికి రూ.7 కోట్లు సమర్పించుకున్న వస్త్రవ్యాపారి ఎస్.పి ఓస్వాల్ కేసులో పురోగతి కనిపించింది. పంజాబ్‌లోని లూథియానా పోలీసులు స్కామర్ల గుట్టును రట్టు చేశారు. ఇందులో సూత్రధారి అసోంలో ఉన్నట్టు కనుగొన్నారు. 15 మంది అనుమానితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 4 కోట్లు స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు చెప్పారు. అసోం, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఉన్న స్కామర్ల నెట్‌వర్క్‌ను కను గొన్నట్టు వివరించారు. బ్యాంకింగ్ స్కాం అసోంలో ఉన్నదనీ, ఆపరేషన్లు ఢిల్లీ-ఎన్‌సిఆర్ నుంచి జరుగుతున్నట్టు ఈ కేసు విచారణలో భాగమైన పోలీసు ఉన్నతాధికారి ఒకరు ఈ విషయాన్ని చెప్పారు. వర్ధమాన్ గ్రూపు ఛైర్మెన్‌గా, మేనేజింగ్ డైరెక్టర్‌గా 82 ఏళ్ల ఓస్వాల్ వ్యవహరిస్తున్నారు. ఆయనను స్కామర్లు ఈ ఏడాది ఆగస్టులో స్కైప్ ద్వారా ఫేక్ సుప్రీంకోర్టు విచారణను జరిపారు. సిజెఐ డి.వై చంద్రచూడ్‌గా నిందితులు నటించారు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నుంచి అంటూ నిందితులు ఫోన్ కాల్ చేసి, ఆ తర్వాత సిబిఐ అధికారినంటూ మరొక వ్యక్తి కాల్ చేశాడనీ, తాను మనీలాండరింగ్ కేసులో అనుమానితుడిగా ఉన్నట్టు వివరించాడని ఆ సమయంలో జరిగిన తతంగాన్ని ఓస్వాల్ మీడియాకు వివరించారు. ఈ కేసులో అసోంలోని బ్యాంకు అధికారులు పోషించిన పాత్ర పైనా పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. స్కాం బ్యాంకింగ్ కోణాన్ని ప్లాన్ చేసి, అమలు చేసిన 'సూత్రధారి'గా రుమి కలిటా (35)ను పోలీసులు గుర్తించినట్టు కొన్ని మీడియా కథనాలు చెప్తున్నాయి. నిందితులు ఆమెకు తెలుసని తాము ధ్రువీకరించినా.. ఆమె సూత్రధారి అని కానీ, కీలక నేరస్థులతో సంబంధం ఉన్నదని కానీ తాము చెప్పలేదని పంజాబ్ పోలీసు వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్‌లో గువహతిలోని ఆమె ఇంటిలో సోదాలు జరగటానికి ముందే ఆమె తప్పించుకున్నదని వివరించాయి. అదేనెల 29న అనుమానితులుగా గువహతికి చెందిన అటను చౌదరీ, ఆనంద్ చౌదరీలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ తర్వాత అటను బ్యాంకు ఖాతా నుంచి రూ.9 కోట్లను సీజ్ చేయగా.. అందులో రూ.4 కోట్లు ఓస్వాల్ నుంచి వచ్చినవి కావటం గమనార్హం. ఈ కేసులో మొత్తం 15 మంది నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు.. వారిలో అందరి పేర్లను మాత్రం వెల్లడించలేదు.

అమరావతి మీదుగా కొత్త రైల్వే లైన్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికి 57 కిలోమీటర్ల లైను కాగా, బీహార్‌కు ఏకంగా 256 కిలోమీటర్ల లైన్ వేయనున్నారు.

రూ.1000కోట్లతో వెంచర్ కేపిటల్ ఫండ్

ఇన్ స్పేస్ ఆధ్వర్యాన అంతరిక్ష రంగానికి రూ.వెయ్యి కోట్ల వెంచర్ కేపిటల్ ఫండ్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. భారత రోదసీ రంగంలో ఉపాధి అవకాశాల పెంపునకు ఈ ప్రతిపాదిత నిధి ఉపయోగపడుతుంది. రోదసీ రంగానికి సంబంధించిన సరఫరా వ్యవస్థలో పలు స్టార్టప్‌లు ఏర్పాటుకు మద్దతిస్తుంది. ఆర్అండ్ డిలో పెట్టుబడులకు, వారి సిబ్బంది సంఖ్యను పెంచుకోవడానికి ఉపయోగపడుతుంది.

'పాళి'కి క్లాసికల్ భాష హోదా

పాళి భాషకు క్లాసికల్ హోదా ఇస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల బౌద్ధమతాన్ని విశ్వసించే వారిలో ఆధ్యాత్మికత ఆనందం వెల్లివిరుస్తుందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. కోలంబలోని ఐసిసిఆర్‌లో ఈ అంశంపై జరిగిన ప్యానెల్ చర్చలో పాల్గొన్న వివిధ దేశాలకు చెందిన పండితులకు, బౌద్ధ సన్యాసులకు మోడీ కృతజ్ఞతలు తెలియచేశారు.

బహుళ ధ్రువ ప్రపంచం చారిత్రక అవసరం

- బొలీవియా అధ్యక్షుడు ఆర్సె

కజన్: బహుళ ధ్రువ ప్రపంచం నేడు చారిత్రక అవసరమని బొలీవియా అధ్యక్షుడు లూయిస్ ఆర్సె చెప్పారు. నూతన బహుళ ధ్రువ ప్రపంచ క్రమంలో ప్రపంచ నిర్ణాయక వ్యవస్థలో వర్ధమాన దేశాలు మెరుగైన పాత్ర కల్పించాల్సిన అవసరముందన్నారు. పదహారవ బ్రిక్స్ సదస్సులో ఆయన మాట్లాడుతూ, అమెరికా రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాన్ని బద్దలు కొట్టేందుకు బ్రిక్స్ కూటమి ఒక గొప్ప అవకాశమని ఆయన చెప్పారు. అమెరికా తన డాలర్ ద్వారా ప్రపంచాన్ని నియంత్రిస్తున్నదని, ఈ బ్రెటన్ వుడ్స్ వ్యవస్థకు తెర దించాలని ఆర్సె అన్నారు. 1945 నుంచి ఆర్థిక సంబంధాల్లో డాలర్ పెత్తనం సాగుతోందని, ఇది అంతిమంగా పశ్చిమ దేశాలకే ఎక్కువ ప్రయోజనం చేకూర్చుతోందని అన్నారు. నూతన ప్రపంచ క్రమం మరింత సమతుల్యంగా ఉంటుందనడానికి బ్రిక్స్ ఒక నిదర్శనమన్నారు. బ్రెటన్ వుడ్స్ సంస్థలైన ఐఎంఎఫ్, వరల్డు బ్యాంక్‌లను సంస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. బ్రిక్స్‌లో సభ్యురాలిగా చేరేందుకు తనకు మద్దతు ఇచ్చిన రష్యాకు వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో ధన్యవాదాలు తెలిపారు.

ఇజ్రాయిల్‌కు ఆయుధ అమ్మకాలు నిలిపేయాలి : ఎర్డోగన్

అడ్డు అదుపు లేకుండా పోతున్న ఇజ్రాయిల్ దురాక్రమణ పోకడలకు కళ్లెం వేయాలని, ఆ దేశానికి ఆయుధాల సరఫరాను నిలిపేయాలని టర్కీ అధ్యక్షుడు తయిప్ ఎర్డోగన్ కోరారు. ఆయన గురువారం 16 వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో మాట్లాడుతూ, 21 వ శతాబ్దిలోనే అతి పెద్ద మానవ విషాదాన్ని ఊచకోత రూపంలో పాలస్తీనా ప్రజలు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ఇజ్రాయిల్‌కు ఆయుధ అమ్మకాలను నిలిపేయాలన్న తన చొరవకు ఈ సదస్సులో పాల్గొన్న దేశాలన్నిటి మద్దతు లభిస్తుందన్న విశ్వాసం తనకుందని అన్నారు.

ప్రపంచ అభివృద్ధి, భద్రతలో బ్రిక్స్ కీలక పాత్ర
ఐరాస చీఫ్ ఆంటోని గుటెరస్

అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థకు కాలం తీరింది, అది అసమర్థమైనది, అన్యాయమైనది అని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెరస్ అంగీకరించారు. ప్రపంచ జనాభాలో దాదాపు సగ భాగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బ్రిక్స్ దేశాలనుద్దేశించి ఆయన గురువారం మాట్లాడారు. పదహారవ శిఖరాగ్ర సదస్సు ప్రధాన గ్లోబల్ సవాళ్లపై దృష్టి సారించాలని ఆయన కోరారు. గ్లోబల్ సవాళ్లను ఏదో ఒక గ్రూపు లేదా దేశం ఒంటరిగా ఎదుర్కోజాలదు. గ్లోబల్ సవాళ్లను ఎదుర్కోవడానికి వివిధ దేశాలన్నీ కలసి గ్లోబల్ ఫ్యామిలీగా వ్యవహరించాలని ఆయన అన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న సిపిఎం అభ్యర్థి ప్రదీప్

కేరళలో ఎల్‌డిఎఫ్ అభ్యర్థుల నామినేషన్లు

కేరళలోని చెలక్కర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా యుఆర్ ప్రదీప్, పలక్కాడ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎల్‌డిఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా డాక్టర్ పి.సరైన్ గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థులకు మద్దతుగా వేలాదిమంది ర్యాలీల్లో పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పి.సరైన్

పిఎసి విచారణకు సెబీ చీఫ్ డుమ్మా..!

- మరో రోజుకు వాయిదా



న్యూఢిల్లీ : అదానీ కంపెనీలకు ప్రయోజనం చేకూర్చేవిధంగా తన పదవిని దుర్వినియోగం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పూరి బచ్ పార్లమెంటరీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) విచారణకు డుమ్మా కొట్టారు. గురువారం జరగాల్సిన ఈ విచారణకు కొన్ని గంటల ముందు తాను రాలేకపోతున్నానని పిఎసికి సమాచారం ఇచ్చారు. వ్యక్తిగత అత్యవసర పనుల కారణంగా హాజరు కాలేకపోతున్నానని పేర్కొన్నారు. దీంతో సమావేశాన్ని వాయిదా వేయాలని నిర్ణయించామని పిఎసి ఛైర్మన్ కెసి వేణుగోపాల్ తెలిపారు. ఓ మహిళా అధికారి విజ్ఞాపన చేసినందున సమావేశాన్ని మరో రోజుకు మార్చాలని తాము భావించామని మీడియాతో తెలిపారు. పిఎసి ఎదుట హాజరు కాకుండా తనకు మినహాయింపు ఇవ్వాలంటూ మాధబి గతంలోనే అభ్యర్థన పంపారు. దానిని పిఎసి తోసిపుచ్చింది. ఆ తర్వాత కమిటీ ఎదుట తాను, తన అధికారులు హాజరవుతారని ఆమె సమాచారం ఇచ్చారు. గౌతం అదానీకి చెందిన విదేశీ పెట్టుబడి సంస్థలతో మాధబి అంటకాగుతున్నారని అమెరికన్ సంస్థ హిండెన్‌బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే. అదే విధంగా మాధబి సెబీలో చేరినప్పటికీ ఐసిఐసిఐ బ్యాంక్ నుంచి ఆదాయాలు పొందుతున్నారని.. తన భర్త దావల్ బుచ్‌కు చెందిన అడ్వైజరీ కన్సల్టెన్సీ సంస్థతో కార్పొరేట్ సంస్థలతో పరస్పర ప్రయోజనాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పలుమార్లు విమర్శలు చేసింది. మాధబిపై వెల్లువలా వచ్చిన విమర్శలపై విచారణకు హాజరవ్వాలని పిఎసి నోటీసులు పంపించగా.. ఆమె గైర్హాజరు కావడం గమనార్హం.

గడియారం గుర్తు అజిత్ పవార్ గ్రూపునకే

ముంబై : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు శరద్ పవార్‌కు సుప్రీంకోర్టులో గురువారం ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ గడియారం గుర్తు అజిత్ పవార్ గ్రూపు గుర్తుగా కొనసాగించాలని కోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల్లో గడియారం గుర్తును అజిత్‌పవార్ గ్రూపు ఉపయోగించుకోవచ్చని, ప్రచార సమయంలో శరద్‌పవార్ గ్రూపునకు నష్టం కలగకుండా గమనిక ద్వారా ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని పేర్కొంది. నవంబర్ 6లోగా అందుకు సంబంధించి హామీ పత్రం సమర్పించాలని ఆదేశించింది. తమ ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తున్నట్లు తేలితే సుమోటోగా ధిక్కార చర్యలు తీసుకుంటామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ గుప్త, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం పేర్కొంది. శరద్ పవార్ గ్రూపు దాఖలు పిటిషన్‌పై సుప్రీంకోర్టు తాత్కాలిక నిర్ణయం తీసుకుంది.

ఉల్లి రైతుకు సున్నం!

(మొదటిపేజీ తరువాయి)

లభిస్తోంది. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలో సగం మాత్రమే రైతుకు వస్తోంది. వ్యాపారులు రైతు నుంచి తక్కువకు కొని మార్కెట్లో ఎక్కువ ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ నామ్ విధానం పని చేయకపోవడం వల్ల ధరల ఖరారు, తూకాలు, బిల్లుల చెల్లింపులోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. మరోవైపు ఉల్లితో మార్కెట్ నిండిపోవడంతో ఇతర ఉత్పత్తులు ఏవీ మార్కెట్‌కు తీసుకురావద్దంటూ మార్కెట్ అధికారులు ప్రకటించారు.

మాట్లాడుకుని తక్కువ ధర ఇచ్చారు...

ఎకరా విస్తీర్ణంలో ఉల్లి సాగు చేశాను. మళ్లీ వర్షం వస్తుందనే భయంతో ఉల్లి కోసి మార్కెట్‌కు తెచ్చాం. 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ నామ్ విధానం పనిచేయలేదని చెబుతున్నారు. కమీషన్ ఏజెంట్లు వచ్చి ఉల్లిని చూసి వెళ్లి క్వింటాలు రూ.3,200 చొప్పున కొనుగోలు చేశారు. వారందరూ ముందే మాట్లాడుకొని ఆ ధరకు కొన్నారు.

– చంద్రయ్య, గూడూరు.

రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో ఉల్లి విక్రయించేందుకు ప్రభుత్వం కర్నూలు మార్కెట్ నుంచే కొనుగోలు చేస్తోంది. ఇప్పటి వరకూ 111 టన్నుల ఉల్లిని కొనుగోలు చేసింది. తాడేపల్లిగూడెం వంటి ఇతర మార్కెట్లలో లభిస్తున్న ధరే కర్నూలు మార్కెట్‌లోనూ వస్తుండడంతో రైతులందరూ ఉల్లిని కర్నూలుకు తీసుకొస్తున్నారు. ఉల్లి విక్రయాలపై రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఆర్.జయలక్ష్మి, కర్నూలు మార్కెట్ యార్డు కార్యదర్శి.



మీకోసం

ధనియాలు నోట్లో వేసుకొని చప్పరిస్తూ ఉంటే నోటి దుర్వాసన తగ్గుతుంది.

జీవన సౌరభం

ఓ మంచి ఆలోచన లక్షలాదిమందిని కదిలిస్తుంది. లక్షలాది మందిలో కదలిక ఒక సమాజాన్ని కదిలిస్తుంది.

స్వచ్ఛత



శుచి ...శుభ్రత
జీవన భద్రత

వ్యక్తిగత పరిశుభ్రత
ఆరోగ్యానికి సఖ్యత
పరిసరాల పరిశుభ్రత
జీవనమే స్వచ్ఛత

స్వచ్ఛమైన వాయువుకై
పచ్చదనం మొలకెత్తాలి
పర్యావరణ పరిరక్షణకై
మనందరి చేతులు కలవాలి

మంచి ఆహారపు అలవాట్లు
మన ఆరోగ్యానికి సింగారం
వాతావరణ కాలుష్యం పాట్లు
తొలగితేనే బతుకు బంగారం

పొత్తంతో చేయాలి స్నేహం
వికసించాలి బాల్యం
నీతి కథలు అమూల్యం
నైతిక విలువల వనం

చరవాణి వీడాలి
సాంప్రదాయ ఆటలు ఆడాలి
విజ్ఞానం వెలగాలి
మూఢత్వం తొలగాలి!

- మొర్రి గోపి,
88978 82202.



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న చుక్కలను అంకెల సహాయంతో వరుసగా కలపండి.

నేను గీసిన బొమ్మ

ఎస్‌కె.జాన్‌బీ,
8వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి,
గుంటూరు.





పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ట్రాన్స్‌జెండర్ల జీవితాల్లో 'నీ తోడు' వెలుగులు

ఇంట్లో ఆదరణ లేక, బయట ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కోలేక ట్రాన్స్‌జెండర్లు సమాజంలో చాలా ఇబ్బందులకు, వివక్షకు గురవుతున్నారు. జీవనాధారం కోసం వీరంతా బస్టాపుల్లోనూ, రైల్వేస్టేషన్ల వద్ద, రైళ్లలోనూ, దుకాణాల్లోనూ, సిగ్నల్ పాయింట్ల వద్ద బిక్షాటన చేస్తూ జీవనం గడుపుకుంటున్నారు. ఇలా ఏ తోడు లేనివాళ్లకి తాను తోడుగా ఉన్నామంటూ డాక్టర్ అమిత ముందుకొచ్చారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో పర్యటించి వారి బాధలు తెలుసుకున్నారు. 'నీ తోడు సొసైటీ ఫర్ ట్రాంజెండర్స్' అనే సంస్థను స్థాపించి వాటి పరిష్కారమే లక్ష్యంగా ఆమె ముందుకు సాగుతున్నారు.



విజయవాడకు చెందిన అమిత సాల్వటోరియన్ రోమన్ కేథలిక్ మిషన్‌కు చెందిన సిస్టర్. తనవంతుగా ట్రాన్స్‌జెండర్ పర్సన్ల జీవితాల్లో మార్పే లక్ష్యంగా కృషిచేస్తున్నారు. విశాఖ కేంద్రంగా మురళీనగర్‌లోని మాధవధార ప్రాంతంలో 'నీ తోడు సొసైటీ ఫర్ ట్రాన్స్‌జెండర్ పర్సన్' అనే సంస్థను ఏర్పాటుచేసి ఈ కృషిని ప్రారంభించారు. ఆమె ఆంధ్రా యూనివర్శిటీలో సోషల్ వర్క్ విభాగంలో అతిథి అధ్యాపకురాలిగా కూడా కొనసాగుతున్నారు. 2018 నుంచి ట్రాన్స్‌జెండర్ల జీవితాలపై తాను చేసిన పరిశోధనలకు ఆమె పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. 'ట్రాన్స్ జెండర్ పర్సన్ల జీవితాలు–ఎదుర్కొంటున్న సమస్యలు' అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనల్లో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ట్రాన్స్ జెండర్ పర్సన్లు సమాజంలో అణచివేతకు గురౌతున్నారు. సెక్స్ వర్కర్లుగా, యాచకులుగా ఉంటున్నారు. పుట్టుకతో మగవారిగా పుట్టినా సరే పెరిగే కొద్ది క్రోమోజోమ్స్, హార్మోనల్ చేంజెస్‌తో వీళ్ల స్త్రీ లక్షణాలను కల్గివుంటారు. ట్రాన్స్‌జెండర్లలో పేద, ధనిక కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లూ ఉన్నారు. వీళ్లకు కుటుంబంలో ఆదరణ లేక బయటకి నెట్టేయ బడుతున్నారు.

'నీ తోడు'గా మేముంటాం

ట్రాన్స్‌జెండర్ ఐటెంటిటీ కార్డు లేక చాలామందికి పింఛన్లు మంజూరు కావటం లేదు. 'నీ తోడు' సంస్థ ద్వారా ప్రభుత్వాధికారులతో మాట్లాడి 400 మందికి గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లు, హెల్త్‌కార్డులు మంజూరు చేయించారు. తద్వారా గుర్తింపు పొందిన వారంతా ప్రభుత్వం నుంచి పింఛన్లు వంటివి పొందుతున్నారు. విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, ఉపాధి తదితర అంశాలపై అవగాహనా శిబిరాలు, సదస్సులు వంటివి సైతం ఏర్పాటు చేస్తున్నారు. 'నీ తోడు' సంస్థ ద్వారా ఉచితంగా టైలరింగ్‌లో ట్రాన్స్‌జెండర్ పర్సన్లకు శిక్షణ ఇస్తున్నారు. ఇలా శిక్షణ పొందిన వారంతా తమ కాళ్లపై తాము స్వయం ఉపాధి పొందుతున్నారు..

మార్పు మొదలైంది...

సమాజంలో మిగతా వారిలా మంచిగా, ఉద్యోగ, ఉపాధిలో గౌరవ ప్రదంగా జీవించాలని చాలామంది ట్రాన్స్ జెండర్ పర్సన్లు భావిస్తున్నారు. లా, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఇలా ఉన్నత చదువులు సైతం చదువుతున్నవారున్నారు. అలాంటి వారిని గుర్తించిన సిస్టర్ అమిత వారికి ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు తనవంతుగా సాయం చేస్తున్నారు. ఆమెకు తోడుగా ఈ బృందంలో ఇంకా దుంగ నీలిమ, గుంట్రెడ్డి వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు. వీరంతా మధురవాడ ప్రాంతంలోని కొంతమంది ట్రాన్స్‌జెండర్లతో మాట్లాడారు. 'నీ తోడు సొసైటీ' ద్వారా శ్రీ దుర్గ ట్రాన్స్‌జెండర్ పొదుపు సంఘం గ్రూపుని ఏర్పాటు చేయించి కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. హైస్పీడ్ కుట్టుమిషన్ల కోసం రోటరీ క్లబ్ వాల్తేరు ద్వారా రొటేరియన్ ఐపిపి పి.శామ్యూల్ బెన్ విక్టర్‌తో మాట్లాడారు. యూత్ లీడర్‌షిప్, విశాఖపట్టణం పోలియో ప్లస్ కమిటీ జోనల్ చైర్మన్‌గా ఉన్న ఆయన జన శిక్షణాసంస్థాన్ ప్రతినిధి శ్రీనివాస్ ద్వారా రెండు వారాలపాటు హైస్పీడ్ మిషన్లపై శిక్షణ ఏర్పాటు చేయించారు. వీరందరికి శ్రీలక్ష్మి కుట్టు శిక్షణ ఇచ్చారు.




ఆర్థిక అభివృద్ధికోసం...

'నీ తోడు' సంస్థ ద్వారా కుట్టు శిక్షణ పొందుతున్న వారిలో ఎంటెక్, డిగ్రీ, ఇంటర్, బిటెక్, బిఎల్, ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులు చేసిన వారు కూడా ఉన్నారు. మూడు నెలల పాటు కుట్టులో మెలకువలను నేర్చుకున్నారు. ఇప్పుడు సొంతంగా కుట్టు పనులు చేయటానికి సైతం సిద్ధం అయ్యారు.

– యడవల్లి శ్రీనివాసరావు

స్వయం ఉపాధికి తోడ్పాటు



ఎంఎల్‌టితోపాటు ఓటీ టెక్నీషియన్ కోర్సు కూడా పూర్తిచేశాను. ట్రాన్స్ జెండర్ పర్సన్ అని తెలిశాక నన్ను పనిచేస్తున్న సంస్థలో ఉద్యోగంలో నుంచి తొలగించారు. మాలో కష్టపడే తత్వం ఉంది. వివక్షతాభావంతో చూడటం తగదు. ఎవరో ఒకరు చేసిన తప్పుకు అందరినీ బాధ్యులను చేయటం సరికాదు. 'నీ తోడు' సంస్థ ద్వారా మాకు ఉపాధి అవకాశాల్లో శిక్షణ ఇస్తుండటం ఎంతో సంతోషం. మాకు కూడా ప్రౌడ్‌ఫుల్ లైఫ్ కావాలి.

- నవ్య

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం



సమాజంలో మాపై చిన్నచూపు చూస్తోంది. విశాఖపట్టణంలో 400 మందికిపైగా ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అందులో 200 మందికి మాత్రమే పింఛన్లు వస్తున్నాయి. సింగిల్ రేషన్‌కార్డులు రావటం లేదు. ఈ సింగల్ రేషన్ కార్డ్స్, పింఛన్ల కోసం 'నీ తోడు' సంస్థ వారు ఎంతగానో కృషి చేస్తున్నారు.

- వి.నిత్య

ఉన్నతంగా జీవిస్తాం



సమాజంలో ఈసడింపులు భరించలేక పోతున్నాం. మేము కూడా మారుతున్నాం. అవకాశాలు లేక ఇలా షాపుల వద్దకు బిక్షాటనకు వెళ్తున్నాం. మమ్మల్ని గుర్తించండి. రేషన్, పెన్షన్ వంటివి ఇవ్వాలి. వసతులు కల్పించాలి. మాలోనూ విల్‌పవర్ ఉంది. అన్ని విషయాలూ నేర్చుకుంటున్నాం. జీవితంలో పైస్థాయికి వెళ్లాలి. ఉద్యోగాలు చేయాలని భావిస్తున్నాం.

- జి.చైత్ర

వివక్షకు వ్యతిరేకంగా...



దేశంలోని అనేక ప్రాంతాల్లో పర్యటించా. ట్రాన్స్ జెండర్ పర్సన్లు చాలా దయనీయ జీవితాలను గడుపుతున్నారు. ఎవరి ఆదరణకు నోచుకోక వివక్షకు గురౌతుండటాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. అందుకే నా వంతుగా వారి జీవితంలో, జీవన విధానాల్లో మార్పు కోసం కృషిచేస్తున్నాం. గుర్తింపుకార్డులు, హెల్త్‌కార్డులు, సర్టిఫికెట్లు, సింగిల్ రేషన్‌కార్డులు మంజూరుకు మావంతుగా కృషిచేస్తున్నాం. ప్రభుత్వాలు కూడా ఆ దిశగా కృషిచేయాలని కోరుతున్నాం. నాతోపాటుగా ఈ కృషిలో మహిళా ప్రతినిధులు నీలిమ, సెల్ : 7702670209, వెంకటలక్ష్మి, సెల్: 9182586198, సిస్టర్ అంతోనిలా, సిస్టర్ సోయి భాగస్వాములై పనిచేస్తున్నారు.

- సిస్టర్ డాక్టర్ అమిత,
నీ తోడు సొసైటీ ఫర్ ట్రాన్స్‌జెండర్ పర్సన్ వ్యవస్థాపకురాలు,
70135 39914

'బాహుబలి 2 ' రికార్డును 'పుష్ప-2' బ్రేక్ చేస్తుంది : మాలీనవీన్



'రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా వచ్చిన 'బాహుబలి 2' చిత్రం తమిళ రికార్డులను అల్లు అర్జున్ 'పుష్ప 2' చిత్రం బ్రేక్ చేస్తుంది. 'పుష్ప 2'ను తమిళంలో కూడా విడుదల చేయటానికి అవకాశం ఇచ్చిన మైత్రి మూవీ మేకర్స్ అధినేతలకు ధన్యవాదాలు. పుష్ప అనేది జస్ట్ బ్రాండ్ కాదు. ఇది నేషనల్ బ్రాండ్. మూవీపై తమిళనాడులో భారీ అంచనాలు ఉన్నాయి. తమిళంలో డే 1 రోజున దళపతి విజయ్, అజిత్, రజనీకాంత్‌ల తర్వాత ఎవరికి డబుల్ డిజిట్ కలెక్షన్లు లేవు. కానీ పుష్ప సినిమాతో అల్లు అర్జున్ ఈ రికార్డును క్రియేట్ చేసేలా ఉన్నాడు. మేము రీసెంట్‌గా తమిళంలో విజయ్ గోట్ సినిమాను 530 లోకేషన్స్‌లో 803 థియేటర్లలో విడుదలచేశాం. ఇప్పుడు పుష్పను కూడా అదే రేంజ్‌లో విడుదల చేయబోతున్నాం. ఇప్పటివరకు తమిళంలో 'బాహుబలి 2' రికార్డు ఉంది. ఈ చిత్రం అక్కడ రూ.80 కోట్లు కలెక్ట్ చేసింది. అయితే ఈ రికార్డును 'పుష్ప 2' అవలీలగా బ్రేక్ చేస్తుంది' అని తమిళ డిస్ట్రిబ్యూటర్ (ఎజిఎస్ బ్యానర్) మాలి నవీన్ వెల్లడించారు. అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'పుష్ప ది రూల్'. పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 5న విడుదల కానుంది. పుష్ప చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన సమావేశానికి దేశవ్యాప్తంగా ఉన్న డిస్ట్రిబ్యూటర్లంతా హాజరయ్యారు. అప్పుడు మాలి నవీన్ మాట్లాడారు. మైత్రీ మూవీస్ మేకర్స్ అధినేతల్లో ఒకరైన యలమంచిలి రవిచంద్ర మాట్లాడుతూ అల్లు, మెగా ఫ్యామిలీ కలిసే ఉన్నాయన్నారు. డివైడ్ అయ్యారనే మాట సరికాదని పేర్కొన్నారు.



నేడు 'లగ్గం' సినిమా విడుదల

తెలంగాణా నేపథ్య కుటుంబ కథాచిత్రం 'లగ్గం'. సాయిరోనక్, ప్రగ్యానాగ్రా, రాజేంద్రప్రసాద్, రోహిణి ప్రధాన పాత్రధారులు. రమేష్ చెప్పాల రచన, దర్శకత్వంలో సుభిషి ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా రూపొందిన ఈ చిత్రానికి వేణు గోపాలరెడ్డి నిర్మాత. శుక్రవారంనాడు ఏషియన్ సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ సినిమా విడుదల కానుంది. వేణుగోపాల్ రెడ్డి నిర్మాత. ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ పెళ్లి చేసుకోవటం అంటే రెండు కుటుంబాలు కలవడం కాదు, రెండు మనసులు కలవడమన్నారు. పెళ్లి, కుటుంబాల అనుబంధాన్ని తెలియజేసే ప్రేమకథా చిత్రంగా 'లగ్గం' నిలిచిపోతుందన్నారు.

వైజాగ్‌లో కళ్యాణ్‌రామ్



కల్యాణ్ రామ్ ప్రస్తుతం 'ఎన్‌కెఆర్-21'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ మూవీతో ప్రదీప్ చిలుకూరి డైరెక్టర్‌గా పరిచయం కాబోతున్నారు. అశోక క్రియేషన్స్ బ్యానర్‌పై అశోక్ వర్ధన్ ముప్ప, సునిల్ బలుసు, ఎన్టీఆర్ ఆర్ట్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన లేటెస్ట్ షెడ్యూల్ వైజాగ్‌లో స్టార్ట్ చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. షూటింగ్‌కి సంబంధించిన ఓ పిక్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ షూట్‌లో ప్రధాన తారాగణం అంతా పాల్గొంటున్నారు. 15 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను తెరకెక్కించనున్నారు.


గ్లామర్ పాత్రలు ఎందుకు చేయనంటే..




సాయిపల్లవి తాజాగా ఆమె నటించిన 'అమరన్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూలో గ్లామర్ పాత్రలపై తనకు ఎందుకు ఆసక్తి లేదో చెప్పారు. 'నేను సినిమాలలోకి రాకముందు ఎడ్యుకేషన్ నిమిత్తం జార్జియా వెళ్లాను. అక్కడ ఎంతో ఫేమస్ అయిన టాంగో డ్యాన్స్ నేర్చుకున్నా. ఆ డ్యాన్స్ చేయడానికి ప్రత్యేకంగా ఒక కాస్ట్యూమ్ ఉంటుంది. ఆ కాస్ట్యూమ్‌లో సౌకర్యంగా ఫీలయ్యాకే ఆ డ్యాన్స్‌లో శిక్షణ పొందాను. ఒక స్టేజ్ మీద ఆ డ్యాన్స్ కూడా చేశాను. ఆ తర్వాత కొంతకాలానికి ప్రేమమ్ సినిమాలో అవకాశం వచ్చింది. ఆ సినిమా టైమ్‌లో నా టాంగో డ్యాన్స్ వీడియోను కొందరు నెటిజన్లు షేర్ చేసి చాలా నెగిటివ్‌గా కామెంట్స్ చేశారు. ఆ కామెంట్స్ నన్ను ఎంతగానో బాధపెట్టాయి. ఆ రోజు ఇకపై సినిమాల్లో శరీరం కనిపించేలా దుస్తులు వేయకూడదని నిర్ణయించుకున్నాను. అదే ఇప్పుడు ఒక నియమంలా మారిపోయింది' అన్నారు.

హాలీవుడ్ నటుడు రాన్ ఎలీ మృతి

గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రముఖ హాలీవుడ్ సిరీస్ నటుడు రాన్ ఎలీ (86) తుదిశ్వాస విడిచారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'టార్జన్' సినిమాలో ఆయన హీరోగా నటించిన విషయం తెలిసిందే. ఆయన మృతికి హాలీవుడ్, బాలీవుడ్ నటులు తీవ్ర సంతాపం తెలిపారు. తన తండ్రి మృతిచెందిన విషయాన్ని రాన్ ఎలీ కుమార్తె కిర్‌స్టెర్ ఎలీ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. 'ఈ ప్రపంచం నాకు తెలిసిన గొప్ప వ్యక్తుల్లో ఒకరిని కోల్పోయింది. అలాగే నేను నా తండ్రిని కోల్పోయాను. మా నాన్నని అందరూ హీరో అని పిలిచేవారు. ఆయన నటుడిగా, రచయితగా, కోచ్‌గా, గురువుగా, కుటుంబ వ్యక్తిగా, నాయకుడిగా రాణించిన వ్యక్తి. అతడు ఏ రంగంలోకి వెళ్లినా అక్కడ తన మార్క్‌ను చూపించడమే కాకుండా..పాజిటివ్ వైబ్స్‌ను క్రియేట్ చేసేవారు. అతను ఇతరులపై ప్రభావం నేను మరే వ్యక్తిలోనూ చూడనిది. అతనిలో నిజంగా ఏదో అద్భుతం ఉంది. ఆయన మరణం మా కుటుంబానికి తీరని లోటు' అని పేర్కొన్నారు.





తిప్పేసిన సుందర్



సుందర్‌ను అభినందిస్తున్న కెప్టెన్ రోహిత్ శర్మ

• న్యూజిలాండ్ 259 ఆలౌట్

పూణే : పుణే టెస్టులో భారత స్పిన్నర్లు కదం తొక్కారు. వాషింగ్టన్ సుందర్ ఏడు వికెట్లు, అశ్విన్ మూడు వికెట్లు తీసి న్యూజిలాండ్‌కు దెబ్బతీసారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ జట్టు 259 పరుగులకే ఆలౌట్ అయ్యింది. సిరీస్ సమం చేయాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో తొలి రోజే కివీస్‌కు కుప్పకూల్చి ఒత్తిడిలో పడేసింది. వాషింగ్టన్ సుందర్(7/49), రవిచంద్రన్ అశ్విన్(3/64) సైతం ఓ చేయి వేయడంతో న్యూజిలాండ్ బ్యాటర్లు తోకముడిచారు. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ వికెట్ నష్టానికి 16 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్(10 నాటౌట్), యశస్వీ జైస్వాల్ (6 నాటౌట్)లు క్రీజులో ఉన్నారు. న్యూజిలాండ్ జట్టులో రచిన్ రవీంద్ర(65)ను బౌల్డ్ చేసి తొలి వికెట్ సాధించిన సుందర్.. వరుసగా చివరి 7 వికెట్లు తీసి తనపై కోచ్, కెప్టెన్‌లు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. సుందర్ ధాటికి డారిల్ మిచెల్(18), టామ్ బ్లండిల్(3), గ్లెన్ ఫిలిఫ్స్(9), శాంట్నర్(33), సౌథీ(5), అజాజ్ పటేల్(4)లు పెవిలియన్‌కు క్యూ కట్టారు.

కాన్వే, రవీంద్ర జోరు

న్యూజిలాండ్‌ను డెవాన్ కాన్వే(76), రచిన్ రవీంద్ర(68)లు మరోసారి కీలక ఇన్నింగ్స్‌తో ఆదుకున్నారు. తొలి సెషన్ మొదలైన కాసేపటికే అశ్విన్ తన తొలి ఓవర్లే టామ్ లాథమ్(15)ను వెనక్కి పంపాడు. ఆ తర్వాత కాన్వే, విల్ యంగ్(18)ల జోడీ క్రీజులో పాతుకుపోయింది. ఇద్దరూ ఆచితూచి ఆడుతూ జట్టు స్కోర్‌బోర్డును నడిపించారు. అయితే.. అశ్విన్ మరోసారి తన అనుభవాన్ని ఉపయోగించి యంగ్‌ను బోల్తా కొట్టించాడు. అంతే.. 76 వద్ద న్యూజిలాండ్ రెండో వికెట్ పడింది. లంచ్ తర్వాత ఇద్దరూ అర్ధ సెంచరీలతో న్యూజిలాండ్‌ను ఆదుకున్నారు. కానీ.. సుందర్ పర్యాటక బ్యాటర్లకు షాకిస్తూ వికెట్ల వేట మొదలెట్టాడు. రవీంద్రను బౌల్డ్ చేసిన సుందర్.. ఆఖరి 7 వికెట్లను తన ఖాతాలో వేసుకొని రికార్డు సృష్టించాడు. న్యూజిలాండ్‌లో అత్యుత్తమ టెస్టు గణాంకాలు నమోదు చేసిన మూడో భారత బౌలర్‌గా సుందర్, అశ్విన్ రికార్డును సమం చేశాడు. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 79.1 ఓవర్లలో ముగిసింది. అనంతరం తొలి ఒక్క పరుగుకే తొలి వికెట్‌గా రోహిత్ శర్మ(0) వెనుదిరిగాడు. సౌథీ బౌలింగ్‌లో డిఫెన్స్ చేయబోయి హిట్‌మ్యాన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత శుభ్‌మన్ గిల్(10 నాటౌట్), యశస్వీ జైస్వాల్(6 నాటౌట్)లు కివీస్ బౌలర్లకు అవకాశమివ్వలేదు. దాంతో, భారత్ వికెట్ నష్టానికి 16 పరుగులు చేసింది.

స్కోర్‌బోర్డు...

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్‌బి) అశ్విన్ 15, కాన్వే (సి)పంత్ (బి)అశ్విన్ 76, యంగ్ (సి)పంత్ (బి)అశ్విన్ 18, రచిన్ రవీంద్ర (సి)సుందర్ 65, మిఛెల్ (ఎల్‌బి)సుందర్ 10, బ్లండెల్ (బి)సుందర్ 3, ఫిలిప్స్ (సి)అశ్విన్ (బి)సుందర్ 9, సాంట్నర్ (బి)సుందర్ 33, సోథీ (బి)సుందర్ 5, అక్షర్ పటేల్ (బి)సుందర్ 4, ఓరూర్కే (నాటౌట్) 0, అదనం 13. (79.1ఓవర్లలో ఆలౌట్) 259పరుగులు. **వికెట్ల పతనం:** 1/32, 2/76, 3/138, 4/197, 5/201, 6/204, 7/236, 8/242, 9/252, 10/259 **బౌలింగ్:** బుమ్రా 8-2-32-0, ఆకాశ్ దీప్ 6-0-41-0, అశ్విన్ 24-2-64-3, సుందర్ 23.1-4-59-7, జడేజా 18-53-0

ఇండియా తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బ్యాటింగ్) 6, రోహిత్ (బి)సోథీ 0, శుభ్‌మన్ (బ్యాటింగ్) 10, (11ఓవర్లలో వికెట్ నష్టానికి) 16పరుగులు. **వికెట్ల పతనం:** 1/1 **బౌలింగ్:** సోథీ 3-1-4-1, ఓరూర్కే 3-2-5-0, అజాజ్ పటేల్ 3-1-5-0, సాంట్నర్ 2-0-2-0



చాంపియన్‌కు టీమిండియా ఝలక్

తొలి వన్డేలో న్యూజిలాండ్ మహిళలపై ఘన విజయం

అహ్మదాబాద్: టి20 ప్రపంచకప్ విజేత న్యూజిలాండ్‌పై భారత మహిళల జట్టు ఘన విజయం సాధించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన తొలి వన్డేలో టీమిండియా 59 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టును ఓపెనర్ షెఫాలీ వర్మ(33) రాణించినా.. కెప్టెన్ స్మృతి మంధాన(5) నిరాశపరిచింది. ఆ తర్వాత వికెట్ కీపర్ యాస్టికా భాటియా(37) రాణించినా.. హేమలత(3) నిరాశపరిచింది. 91పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ భారత్‌ను రోడ్రిగ్స్(35), తేజల్(42), దీప్తి(41) ఆదుకున్నారు. దీంతో భారతజట్టు 44.3ఓవర్లలో 227పరుగులకు ఆలౌటైంది. న్యూజిలాండ్ బౌలర్లు అమేలా కెర్‌కు నాలుగు, జెస్ కెర్‌కు మూడు, ఈడెన్ కార్సన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో న్యూజిలాండ్‌ను రాధా యాదవ్(3/35), సైమా థాకూర్(2/26)లు చెలరేగి బౌలింగ్ చేశారు. ప్లిమియర్(25), లారెన్(26), బ్రౌక్(39), గ్రీన్(31), అమేలా కెర్(25) మాత్రమే రాణించారు. దీంతో న్యూజిలాండ్ 40.4ఓవర్లలో 168పరుగులకు పరిమితం చేశారు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దీప్తి శర్మకు దక్కింది.

16ఏళ్ల హాకీ కెరీర్‌కు రాణి రాంపాల్ గుడ్ బై



ఛండీగడ్ : భారత మహిళా హాకీ జట్టు మాజీ కెప్టెన్ రాణి రాంపాల్ వీడ్కోలు పలికింది. సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్టు గురువారం రాంపాల్ వెల్లడించింది. టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఆమె తన 16ఏళ్ల కెరీర్‌కు గుడ్ బై చెప్పేసింది. ఫార్వర్డ్ ప్లేయర్ అయిన రాణి సారథిగా భారత హాకీకి వన్నె తెచ్చింది. ఆమె ఏకంగా 254 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. 'భారత జట్టుతో నా ప్రయాణం ఎంతో చిరస్మరణీయం. ఇన్నేళ్లు దేశం తరపున ఆడతానని ఊహించ లేదు. టీమిండియాకు ఆడాలనే కాంక్షతో అన్ని అడ్డంకులు దాటి నిజం చేసుకున్నా' అని రాణి మీడియా సమావేశంలో తెలిపింది. హరియాణాకు చెందిన రాణి రాంపాల్ 15ఏళ్లకే జాతీయ జట్టుకు ఎంపికైంది. ఫార్వర్డ్ ప్లేయర్‌గా తన ముద్ర వేసిన ఆమె అనతికాలంలోనే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టింది. రాణి సారథ్యంలో భారత మహిళల జట్టు అద్భుత విజయాలు సాధించింది. ఆమె కెప్టెన్సీలో 2014 ఆసియా క్రీడల్లో కాంస్యం.. 2018 ఆసియా గేమ్స్‌లో రజతం సాధించింది. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో 4వ స్థానంలో నిలిచింది. 16ఏళ్ల కెరీర్‌లో రాణి 205 గోల్స్ కొట్టింది. భారత హాకీకి విశేష సేవలు అందించిన ఆమెకు ప్రభుత్వం 2020లో ప్రతిష్ఠాత్మక 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' అవార్డుతో గౌరవించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68